
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



### మండుటెండల్లో....

# వణుకుతున్న చంద్రన్న!

- మింగుడుపడని మోడీ - జగన్‌ల భేటి
- వాళ్ళిద్దరి మధ్య ఏం జరిగిందన్నదానిపై ఆరా
- తన అవినీతి చిట్టా బయటపెట్టాడని ఆగ్రహం
- కలవరపెడుతున్న కమలం ప్రకటనలు

ఒకప్పుడు చంద్రబాబుకు ఢిల్లీలో కూడా గట్టి నాయకుడనే పేరుండేది. 1996లో 13రోజుల ప్రధాని వాజ్‌పేయిని దించేసి యూనైటెడ్ ఫ్రంట్ కూటమిని కట్టించింది చంద్రబాబే! ఆ తర్వాత 1998, 1999లలో ఏర్పడ్డ ఎన్డీఏ ప్రభుత్వాల లోనూ కీలక భాగస్వామిగా వున్నాడు. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీని జైలులో (మిగతా 11వ పేజీలో)

*అసలు ఢిల్లీలో ఏం జరిగింది? ఏం జరుగుతోంది? ఏం జరగబోతోంది? నాకిప్పుడే తెలియాలి అన్నంత ఉద్వేగానికి లోనవుతున్నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. వైసిపి అధినేత జగన్‌కు ప్రధాని నరేంద్రమోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వడాన్ని ఆయన ఓ పట్టాన జీర్ణించు కోలేకపోతున్నాడు. ఆయన అమెరికాలో ఉండగానే ప్రధానిని జగన్ కలిసాడన్న వార్త చెవిన పడింది. అక్కడే మనశ్శాంతిగా ఉండలేకపోయాడు. అమెరికా నుండి నేరుగా వచ్చి ఢిల్లీలో దిగగానే తన వెంటవున్న వారిని హైదరాబాద్ పంపించేసాడు. తాను మాత్రం ఏడు గంటలపాటు ఎవరికీ అందుబాటులో లేకుండా గడిపాడు. జగన్ ప్రధానిని ఎందుకు కలిసాడు, ఏం చెప్పాడు, అసలు అర్థాంతరంగా జగన్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటన్నది తెలుసుకోవడం కోసమే ఆయన ఆ కొన్ని గంటలు అజ్ఞాతంలో గడిపినట్లు తెలుస్తోంది.*



- వాకాటిపై సిబిఐ దాడి
- సస్పెండ్‌తో వదిలించుకున్న టీడీపీ!
- మిగిలినోళ్ళ సంగతేంది బాబూ?



# పాపం పండెన్!

నరేంద్ర మోడీ పక్కసీట్లో విమానయానం... చంద్రబాబునాయుడుతో హెలికాప్టర్ ప్రయాణం... అహ్మద్ పటేల్‌తో బ్రేక్‌ఫాస్ట్... గులాంనబీ ఆజాద్‌తో లంచ్... రాహుల్‌గాంధీతో డిన్నర్... సోనియాగాంధీతో కప్పు కాఫీ కుదిరితే నాలుగు మాటలు అన్నట్లుగా వ్యవహరించే శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డికి ఇప్పుడు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ అన్నీ సిబిఐతోనే జరిగిపోతున్నాయి. నేరం రుజువైతే అవన్నీ ఎక్కడ తినాల్నో వేరే చెప్పక్కర్లేదు. ఇంతకాలం నెల్లూరుజిల్లాకు ఒక లోటుండేది. విజయ్‌మాల్యా, సుబ్రతోరాయ్ వంటి ఆర్థికనేరస్థులు ఒకరు కూడా జిల్లాలో లేరు. ఆర్థిక నేరాలకు పాల్పడి సిబిఐ విచారణ ఎదుర్కొన్నవారు ఒక్కరూ లేరు. ఆ లోటును ఇప్పుడు వాకాటి నారాయణరెడ్డి తీర్చాడు.

నెల్లూరు వేదాయపాలెంలోని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ఇంటిలో ఇటీవల సిబిఐ సోదాలు నిర్వహించడం జిల్లా రాజకీయాలలోనే సంచలనం సృష్టించింది. నెల్లూరుజిల్లా రాజకీయాలలో ఇంతవరకు ఏ నాయకుడి మీదా ఇలాంటి మచ్చలేదు. రాజకీయాలలో సంపాదించుకున్న నాయకులున్నారు, పోగొట్టుకున్న నాయకులు వున్నారు. అయితే బ్యాంకులకు వందలకోట్లు (మిగతా 11వ పేజీలో)






### నోరు తెరిచారు

# 'దేశం'పై అరిచారు

## మనసులో ఆక్రోశాన్ని బయటపెట్టుకున్న రాష్ట్ర బీజేపీ నేతలు

ఆంధ్రప్రదేశ్ బీజేపీ నాయకులు మూడేళ్ళుగా ఓ సందిగ్ధావస్థలో వున్నారు. వాళ్ల మనసుల్లో వున్న భావాలను బయటకు చెప్పలేకపోతూ వచ్చారు. కేంద్రంలో మాది నీతివంతమైన పాలన అని చెప్పుకోగలిగారేగాని, రాష్ట్రంలో జరుగుతున్న ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించలేకపోయారు. ప్రధానిగా నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధిని చెప్పుకోగలిగారేగాని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి ముసుగులో చేపట్టిన అక్రమాలను ఎదిరించలేకపోయారు. దీనికంతటికీ కారణం మిత్రపక్షం అనే ధర్మం అడ్డు రావడం. తెలుగుదేశం ప్రభుత్వంలో తామూ భాగస్వాములమై ఉండడం. (మిగతా 11వ పేజీలో)

# ముగిసిన నరసింహుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరురూరల్ మండలం నరశింహకొండలో వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరశింహస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ నుండి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. 4వ తేదీ రాత్రి అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 5వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహన సేవ, 6వ తేదీ రాత్రి హంసవాహనసేవ, 7వ తేదీ రాత్రి సింహ వాహనసేవ, 8వ తేదీ రాత్రి హనుమంతసేవ, 9వ తేదీ మధ్యాహ్నం మోహిని ఉత్సవం, సాయంత్రం 6గంటలకు అఖండజ్యోతి, 7 గంటలకు మూలవర్లకు పూలంగిసేవ, అర్థరాత్రి బంగారు గరుడసేవ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. 10వ తేదీ సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్లకు కళ్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రాత్రి గజవాహన సేవ కార్యక్రమాలు జరిగాయి. 11వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 13వతేదీ ధ్వజావరోహణ, 14వతేదీ రాత్రి ఏకాంత సేవ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు మాధవగిరి వెంకట అప్పలాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ప్రతిరోజూ ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాంప్రదాయాన్ని అనుసరించి స్వామివారికి చప్పరోత్సవం, ప్రాకారోత్సవం విశేషంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మలినేని వెంకటేశ్వరరావు, ఈఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు.


సింహపురి సమాచారం

# లక్ష్యాన్ని అధిగమిస్తాం

## - జిల్లా రిజిస్ట్రార్ అబ్రహం



నెల్లూరుజిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.230.17కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. 2016-17 సంవత్సరం లక్ష్యంతో పోలిస్తే ఇది రూ.50కోట్లు తక్కువ. జిల్లా రిజిస్ట్రేషన్ శాఖను నెల్లూరు, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లాలుగా విభజించారు. మొత్తం లక్ష్యంలో నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లాకు రూ.155.17 కోట్లు, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లాకు రూ.75కోట్లు లక్ష్యంగా విధించారు. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ భూముల క్రయవిక్రయాలు బాగా తగ్గిపోయాయి. రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు లేక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలపోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా తగ్గినా, భూములు, స్థలాలు ధరలు తగ్గడం లేదు. 2009 నుంచి 2011 వరకు జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక వెలుగు వెలిగింది. ఆ సమయంలో భూములు, స్థలాల ధరలు భారీగా పెరిగాయి. ఆ తర్వాత ధరలు తగ్గకపోవడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చతికిల పడింది. ఈ పరిస్థితిని గమనించిన రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ జిల్లాకు గత ఏడాది కంటే ఈ దఫా రూ.50 కోట్లు తగ్గించింది. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ యం.అబ్రహం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. జిల్లాలో పలు పరిశ్రమలు ఏర్పాటు వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందని రిజిస్ట్రేషన్లు పెరుగుతాయని ఆశిస్తున్నామన్నారు.




# జొన్నవాడ కొత్త పాలక మండలి

బుచ్చి మండలం జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి దేవస్థానం కొత్త పాలక మండలి ప్రమాణస్వీకారం ఈ నెల 13న ఆలయం వద్ద జరిగింది. ఆలయ కమిటి ఛైర్మెన్‌గా సుబ్రహ్మణ్యంనాయుడు, సభ్యులుగా శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి, కొప్పర్తి హరనాథ్, పాలూరు వెంకటేశ్వర్లు, తిరువీధి రాధాకృష్ణయ్య, పసుపులేటి వెంకటరమణమ్మ, బాలు రవి, చిట్టిబోయిన వేణు, జల్లి పెంచలయ్య, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా వివిఎస్‌జి ప్రసాద్‌ల చేత ఇఓ కె.శివ కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, పెన్నాడెల్టా కమిటీ ఛైర్మెన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఆలయం మాజీ ఛైర్మెన్ సన్నపరెడ్డి వేణు గోపాలరెడ్డి, ఏఎంసి ఛైర్మెన్ భానురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌ఛార్జ్ డిఎఫ్‌వోగా చాణుక్యరాజు

నెల్లూరుజిల్లా అటవీశాఖ అధికారిగా సోషల్ ఫారెస్టు డిఎఫ్ఓ చాణుక్యరాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ డిఎఫ్ఓ చంద్రశేఖర్ దీర్ఘకాలిక సెలవుపై వెళుతున్నారు. దీంతో చాణుక్యరాజుకు జిల్లా అటవీశాఖ బాధ్యతలు అదనంగా అప్పగించారు.

# జడ్పీ ఉద్యోగులకు కౌన్సిలింగ్

జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్య పరిధిలో పని చేస్తూ బదిలీ కొరకు దరఖాస్తు చేసుకుని ఒకే స్థానంలో 5సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ సహాయకులు, టైపిస్టులు, డ్రైవర్‌లు, రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్లు ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని, 3 సంత్సరాల సర్వీసు పైబడి బదిలీ కోరుకున్న అన్ని కేడర్ల సిబ్బంది కూడా హాజరు కావాలని జడ్పీ సిఇఓ వసుమతి ఒక ప్రకటనలో కోరారు.

# అమృత్ క్రింద పార్కుల అభివృద్ధి



నెల్లూరు నగరంలో వున్న వివిధ పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి పరచి సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు తెలిపారు. 17వ తేదీ జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ఢిల్లీ రావుతో కలసి అనీల్‌గార్డెన్స్, పిల్లల పార్కు, ఎన్‌టిఆర్ నగర్ పార్కు, స్వతంత్రపార్కు, విరాట్‌నగర్‌లోని విబిఎస్ కళ్యాణ మండపం వద్దవున్న పార్కు, మహాత్మాగాంధీ పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు నగర పరిధిలో వున్న అన్ని పార్కులను దశలవారీగా అమృత పథకం క్రింద అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. హడ్కోకు సంబంధించి పెండింగ్‌లో వున్న పనులను సకాలంలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎస్.ఇ రవికృష్ణరాజు, ఇ.ఇ జగన్మోహన్, డి.ఇ రఘురామ్, కార్పొరేటర్ అంచూరు జానకి, డివిజన్ ఇన్‌ఛార్జి మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఈ ఏడాదిలో మున్సిపల్ జూనియర్ కళాశాల



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కళాశాలను ప్రారంభించనున్నట్లు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. 17వతేదీ కార్పొరేషన్ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఈ ఏడాది నుంచి జూనియర్ కళాశాలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో 36ఏళ్ల అనుభవం వున్న మంత్రి నారాయణ సహకారంతో సిలబస్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. కెరీర్ ఫౌండేషన్ కోర్సులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడతాయని అన్నారు. గతంలో మున్సిపల్ పాఠశాలల్లో 73శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యేవారని, ఇప్పుడు 83శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ ఏడాది మున్సిపల్ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన 80 నుంచి 90మంది విద్యార్థులకు ఉచితంగా జూనియర్ కళాశాలల్లో విద్యనందిస్తామన్నారు. బాలబాలికలకు విడివిడిగా రెసిడెన్షియల్ వసతిని కల్పిస్తామని ప్రకటించారు. కార్పొరేటర్లు మన్నెం పెంచల నాయుడు, పిట్టి సత్యనాగేశ్వరరావు, టిడిపి నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం, షంషుద్దీన్, పావళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

# విద్యాహక్కు చట్టం అమలులో విఫలం



నిర్బంధ విద్యా హక్కు చట్టం కాగితాలకే పరిమితమవుతోందని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జయవర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మదన్‌కుమార్‌రెడ్డిలు ఆరోపించారు. ఈమేరకు ఈ చట్టం అమలుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చి ఏడేళ్లయ్యింది. ఈ చట్టం అమలు మాత్రం నామమాత్రంగానే వుంది. ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలి, కాని ఏ స్కూల్‌లోనూ అది అమలు జరగడం లేదు. రేషన్‌రైజేషన్ పేరుతో ప్రభుత్వం ప్రభుత్వ బడులను ఎత్తేస్తోంది. ఒలంపియాడ్, స్పార్క్, ఆల్ఫా వంటి రకరకాల పేర్లతో ప్రైవేట్ స్కూల్స్ లక్షల రూపాయల ఫీజులు దండుకుంటున్నాయని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు పెంచలనాయుడు, శేషసాయి, మధు, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



# నిందితులపై కేసులు నీరుగార్చారు!

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో కూడా వున్న మాజీ రిజిస్ట్రార్ శివశంకర్‌పై కేసులను నీరు కార్చేసారని యూనివర్శిటీ విద్యార్థి సమాఖ్య పేర్కొంది. వర్శిటీ అధికారులు విద్యార్థుల పై కక్ష పూరితంగా పెట్టిన కేసులను ఎత్తేయాలంటూ విద్యార్థులు ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని వర్శిటీ కళాశాలలో ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాలో విద్యార్థి సమాఖ్య నాయకులు గంగిరెడ్డి శ్రీనివాసులు, నరేష్, సాయి, కిరణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆలూరి శేషారెడ్డి స్మారకంగా
# మజ్జిగ చలివేంద్రం




నెల్లూరు, కొండాయపాలెం రోడ్డు, వనంతోపు సెంటర్‌లో ఈ నెల 15వ తేదీన స్థానిక నాయకుడు ఆలూరి శేషారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన మిత్రులు, అభిమానులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, ఐదో నగర సిఐ మంగారావు, స్థానిక నాయకులు ఆర్.శ్రీనివాసరావు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎం.శ్రీనివాసులు, ఆర్.శేఖర్, సురేష్, జగదీష్, రమణ, శీనయ్య, సాయి, వేణు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# పెట్టుబడులకు నవ్యాంధ్ర భేష్

## ----- మాంబట్టులో సింగపూర్ మంత్రి -----

ఈ నెల 16వ తేదీన సింగపూర్ వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్, ఏపి పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి తడ మండలంలోని మాంబట్టు ఏపిఐఐసి సెజ్‌ను సందర్శించారు. మాంబట్టు సెజ్ తమకు ఎంతగానో నచ్చిందని సింగపూర్ మంత్రి ఈశ్వరన్ తెలిపారు. ఇక్కడ నీటి లభ్యత, విద్యుత్ పరిశ్రమల ఏర్పాటుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. వాణిజ్య పరంగా నవ్యాంధ్ర అభివృద్ధికి తమ పూర్తి సహాయసహకారాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపి మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతుందన్నారు. చెన్నైకు సమీపంలో వున్న ఈ ఇండస్ట్రియల్ పార్కు పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువుగా వుంటుందన్నారు. ఈశ్వరన్ నేతృత్వంలో వచ్చిన సింగపూర్ వాణిజ్య, పారిశ్రామిక సంస్థల ప్రతినిధుల బృందం ఈ పార్కులోని పరిశ్రమలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఈ సెజ్‌లో స్థాపించిన ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీని మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రులు షార్ సెంటర్‌ను సందర్శించారు.

# విద్యార్థులను భాగస్వాములను చేయండి

**- జేసీ ఇంతియాజ్**



నీరు-ప్రగతి కార్యక్రమంలో కళాశాల విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సంయుక్త కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అన్నారు. ఈ నెల 16వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో నీరు-ప్రగతి కార్యక్రమంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశానుసారం నీరు-ప్రగతి కార్యక్రమంలో జిల్లాలోని ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థుల సహాయ సహకారాలు తీసుకోవాలని, వారికి కావాల్సిన భోజన వసతి సదుపాయం కల్పించాలని, అందుకు అనుగుణంగా ఆయా శాఖాధిపతుల అంగీకారం పొందాలని సూచించారు. ఈ ప్రక్రియ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌గాను, ప్రభుత్వ అధికారులకు వెసలుబాటును కలిగిస్తుందని జాయింట్ కలెక్టర్ అభిప్రాయపడ్డారు. వర్షాలు పడిన తర్వాత నీటిని వడిసి పట్టుకొని రీచార్జి చేయడం ద్వారా భూగర్భ జలాలు వినియోగంలోకి తెచ్చుకునే అవకాశముంటుందని, అదే విధంగా చెక్‌డ్యాములు కూడా వ్యవసాయంలో అత్యంత ప్రాధాన్యత కలిగివుంటాయని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, నీటి పారుదలశాఖ కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

# సైబర్ భద్రత ఏదీ?...

సైబర్ దాడుల వల్ల ఎలాంటి దుష్పరిణామాలు వుంటాయో మొన్న జరిగిన వన్నాక్రై సైబర్ దాడి ప్రపంచానికి రుచిచూపించింది. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వంటివి నేటి మానవుని విజ్ఞానానికి నిదర్శనమని భావిస్తున్న తరుణంలో, సైబర్ దుండగులు వాటిని మానవ వికాసానికి కాక విధ్వంసానికి ఉపయోగించాలని చూడడం వారి రాక్షస ప్రవృత్తికి నిదర్శనం. ఇలాంటి దాడులను వెంటనే అరికట్టకపోతే ప్రపంచానికి ఎంతో ప్రమాదం. అంతేకాదు, సైబర్ వ్యవస్థకు గట్టి రక్షణ కల్పించడం తక్షణావసరం. ప్రపంచ మేధావులంతా ఈ విషయమై ఆలోచించాలి.

సైబర్ నేరగాళ్ళ ఆగడాలకు అంతే వుండడం లేదు. ప్రపంచాన్నే కళ్ళముందు నిలిపే ఇంటర్నెట్‌కే వాళ్ళవల్ల ముప్పు తప్పడం లేదు. అంతర్జాలాన్ని సకల మానవాళి ప్రయోజనం కోసం ఉపయోగించుకోవాల్సిన తరుణంలో, కంప్యూటర్లలోని సమాచారాన్ని తస్కరించి తద్వారా ఆర్థికపరమైన ప్రయోజనం పొందాలని చూసే దుండగుల నేరప్రవృత్తి సహించరానిది. అనేకదేశాల్లోని ప్రజోపయోగమైన సంస్థలకు కూడా కష్టాలు పెట్టేందుకు వెనుకాడని అలాంటి ముష్కరులను ఏమనాలి?.. ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న ఈ సైబర్ దాడులను ఉపేక్షిస్తూపోతే చివరికి ప్రపంచం ఏమవుతుందో?.. మొన్నటికి మొన్న సైబర్ దుండగులు చేసిన దాడులు ప్రపంచ మేధావులనే కలవరపరుస్తోంది.

సైబర్ నేరగాళ్ళు ప్రపంచంపై విరుచుకుపడి దాదాపు నూరు దేశాల్లో కీలకమైన వ్యవస్థలపై దాడులు చేశారు. వన్నాక్రై సైబర్ దాడితో అనేకదేశాల్లోని కంప్యూటర్లలో నిక్షిప్తమై వున్న సమాచారాన్ని హ్యాక్ చేయడంతో అన్ని వ్యవస్థలూ పెను ప్రమాదానికి గురయ్యాయి. సుమారు రెండు లక్షల విండోస్ కంప్యూటర్లను లాక్ చేసి, మూడు వందల డాలర్లు ఇస్తారా?. లేదా వెంటనే మీ పీసీల్లోని సర్వర్లలో వున్న సమాచారాన్ని మొత్తం డిలీట్ చేసేయమంటారా?.. అంటూ ఆ సైబర్ దుండగులు బెదిరింపులకు పాల్పడడం ఎంత దారుణం?.. ఈ ఘటనతో ప్రపంచమే అవాక్కయిపోయిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందో వూహించుకోవచ్చు. మొదట బ్రిటన్‌తో మొదలైన ఈ దాడి శరవేగంగా నూరు దేశాలకు వెంటవెంటనే విస్తరించింది. ఈ దాడితో బ్రిటన్‌లో అల్లకల్లోలమైపోయింది. అక్కడి ఆసుపత్రులన్నీ తమ కంప్యూటర్లపై పట్టుకోల్పోవడంతో రోగుల సమాచారం తెలియక అందరూ బెంబేలెత్తిపోయారు. ఎవరికి చికిత్సలు అందించాలో తెలియని గందరగోళం ఏర్పడింది. ప్రపంచం మొత్తం ఇంటర్‌నెట్‌కు కనెక్టై వున్న కంప్యూటర్లలో ప్రతి మూడింటి లోనూ ఒకటి ఈ దుర్మార్గమైన సైబర్ దాడులకు గురైందని ఆ తర్వాత గుర్తించారు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవుడి వికృత ప్రవృత్తికి ఇది నిదర్శనం. అయితే, ఈ దాడులు ఎవరు చేశారన్నది మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో నిర్ధారణ కాలేదు. 'వాన్నాక్రై, వాన్నా క్రిప్ట్ అనే రాన్‌సమ్ వేర్‌తో ఈ దాడి జరిగిందని భావిస్తున్నారు. ఈ దాడి ప్రభావంతో అమెరికా, రష్యా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, మెక్సికో, భారత్ తదితరత దేశాల్లోని లక్షలాది కంప్యూటర్లు లాక్ అయిపోయాయి. భారత్‌లో పోలీసు వ్యవస్థకు సంబంధించిన అనేక కంప్యూటర్లపై కూడా ఈ ప్రభావం పడడంతో అంతా అయోమయమే. అయితే, భారత్‌పై ఈ దాడులు పెద్దగా ప్రభావం చూపకపోయినప్పటికీ బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రత్యేకించి ఏటిఎం వ్యవస్థ అస్తవ్యస్థమైంది.

ఈ సైబర్ దుండగుల దాడులతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది కంప్యూటర్లు హ్యాకింగ్ అయిపోయి వాటిలోని విలువైన సమాచారాన్ని దుండగులు గుప్పిట పట్టుకున్నారు. వారడిగిన డబ్బుని బిట్‌కాయిన్ల రూపంలో చెల్లిస్తే తప్ప తిరిగి కంప్యూటర్లు పనిచేయవని హెచ్చరించారు. ఎంత బరితెగింపు?... ఒకవేళ ఏదైనా విలువైన సమాచారం పొరపాటున పక్కదారి మళ్ళితే జరిగే ప్రమాదం అంతా ఇంతా కాదు. శత్రుదేశాలకో, ఉగ్రవాదులకో ఆ రహస్య సమాచారాలు తెలిస్తే జరిగే భీభత్సాలు అన్నిన్ని కావు. అందువల్ల సైబర్‌దాడులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. ఈ హ్యాకింగ్‌ల వల్ల బ్రిటన్‌లో ఆరోగ్యవ్యవస్థ దెబ్బతినిపోయింది. శస్త్ర చికిత్సలు నిలచిపోయి రోగులు విలవిలలాడిపోయారు. జర్మనీలో రైల్వే వ్యవస్థ కుదేలైపోయింది. వైమానిక వ్యవస్థ తలక్రిందులైంది. అనేక దేశాల్లో ఐటి రంగం, టెలికమ్యూనికేషన్ల రంగం, విద్యుత్ రంగం అన్నీ అస్తవ్యస్తమైపోయాయి. అనేక దేశాల్లోని బ్యాంకులు, ప్రముఖ సంస్థలు, ప్రజోపయోగసంస్థలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యాయంటే పరిస్థితి ఎంతదాకా వెళ్ళిందో వూహించుకోవచ్చు. కంప్యూటర్ ఆన్ చేయగానే ఫైళ్ళు ఓపన్ కాక, ఈ సైబర్ నేరగాళ్ళ హెచ్చరిక మాత్రమే కన్పిస్తుండడంతో అందరూ అయోమయానికి గురయ్యారు. అయితే, ఎంతో అదృష్టం. బ్రిటన్‌లోని ఓ ఇరవైరెండేళ్ళ యువకుడైన సాఫ్ట్‌వేర్ నిపుణుడు యాదృచ్ఛికంగా రాన్సమ్‌వేర్ కిల్లర్‌స్విచ్‌ను నొక్కడంతో దాదాపు 99 దేశాలను ఈ వన్నాక్రైవైరస్ నుంచి కాపాడినట్లయింది. అయినా, ఈ సైబర్ దాడులు ఈనాటివేమీ కాదు. కంప్యూ టర్లను హ్యాక్ చేయడం, సమాచారం దొంగిలించడం, ఏదో ఒక పేరుతో లింక్‌లు ఇవ్వడం, వాటిని క్లిక్ చేయడంతో ప్రమాదకరమైన వైరస్ కంప్యూటర్లలోకి వచ్చి, అక్కడున్న సమాచారమంతా మటుమాయం కావడం..ఇలాంటివి సర్వసాధారణమైపోతున్నాయి. సైబర్ భద్రత గాలిలో దీపం కావడం దారుణం.. దయనీయం. సైబర్ దాడులను తక్షణం అరికట్టాలి. దుండగులను కఠినంగా శిక్షించాలి. ప్రపంచాన్ని గడగడలాడించిన ఈ వన్నాక్రై సైబర్ దాడుల వెనుక ఏ అదృశ్యహస్తాలున్నాయో బట్టబయలు చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సైబర్ దాడులకు తావు లేకుండా ప్రపంచవ్యాప్తంగా సైబర్ సాంకేతిక వ్యవస్థను కట్టుదిట్టం చేయాలి. అందుకు అంతర్జాతీయ స్థాయిలో అన్నిదేశాలు కలసి వెంటనే ఒక సమిష్టి కార్యాచరణను చేపట్టాలి. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వంటివి నేటి అధునాతన మానవుని విజ్ఞానానికి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమని ప్రపంచం భావిస్తున్న తరుణంలో, వాటిని మానవ వికాసానికి కాక విధ్వంసానికి, మానవుని కష్టాలు పాలుచేయడానికి కొందరు దుండగులు ఉపయోగించాలని చూడడం రాక్షస నైజం. ఈ దాడులను, అనర్ధాలను వెంటనే అరికట్టకపోతే ఎంతో ప్రమాదం. వికాసానికి బదులు వినాశాన్ని కొనితెచ్చుకున్నట్లే అవుతుంది. సైబర్ విజ్ఞానాన్ని మానవాళికి అందించడంతో పాటు, దానికి తక్షణం కట్టుదిట్టమైన రక్షణ కూడా కల్పించాలి. తద్వారా మేధావులు మానవజాతికి మహోపకారం చేయాలి. వెంటనే సైబర్ దుండగుల ఆటలు కట్టించాలి. శాస్త్రవిజ్ఞానాన్ని మానవాళి ప్రయోజనాలకు ఉపయోగించాలే తప్ప, వినాశానికి కాదని ప్రపంచ మేధావులంతా కలసి సగర్వంగా చాటిచెప్పాలి.

### డోలు విద్వాంసుడు
## మస్తాన్‌బాబుకు గౌరవ డాక్టరేట్



నెల్లూరుకు చెందిన ప్రముఖ డోలు విద్వాంసుడు నెల్లూరు మస్తాన్‌బాబు గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. హైదరాబాద్ త్యాగరాజ గాన సభలో జరిగిన కార్యక్రమంలో బర్కిలీ విశ్వవిద్యాలయం ప్రకటించిన గౌరవ డాక్టరేట్‌ను మాజీముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా స్వీకరించారు. వీరితో పాటు ప్రముఖ డోలు విద్వాంసులు యల్లా వెంకటేశ్వరరావు గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న వారిలో వున్నారు. ఆకాశవాణి విజయ వాడ కేంద్రాల్లో 'ఏ' గ్రేడ్ కళాకారుడైన మస్తాన్‌బాబు ప్రతిభకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను అభినందించారు.

## హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నెల్లూరుజిల్లా హాకీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం 13వ తేదీ నెల్లూరు శోధన్‌నగర్‌లోని ఆర్‌విఆర్ ఫంక్షన్‌హాల్లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తొలుత హాకీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ జహీర్ అహ్మద్ మృతికి సంతాపం తెలిపారు. హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశీలకుడిగా సుందరరామిరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిశీలకుడిగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణయ్య, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ పరిశీలకుడిగా అసోసియేషన్ కోశాధికారి పసుపులేటి రామ్మూర్తి పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వొకేట్ గురజాల ప్రసాద్‌నాయుడు వ్యవహరించారు.

### నూతన కార్యవర్గం

నెల్లూరుజిల్లా అధ్యక్షుడిగా శేషయ్య, ఉపాధ్యక్షులుగా భారతి ప్రసాద్, రవీంద్రబాబు, కిషోర్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శిగా థామస్‌పీటర్, అదనపు కార్యదర్శులుగా కోటేశ్వరమ్మ, సురేష్‌బాబు, కోశాధికారిగా స్పర్జన్‌రాజ్, కార్యవర్గ సభ్యులుగా మేరీ శ్యామసుందరి, కరిముల్లాఖాన్, దీపక్, ఆకాష్‌బాబు, అనిల్‌కుమార్, శీనమ్మ, అపర్ణ ఎన్నికయ్యారు. జిల్లా పిఇటి అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కృష్ణారెడ్డి, సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవాజ్ సేవాసంస్థ వితరణ



నెల్లూరుజిల్లా కావలి పట్టణం వైకుంఠపురం కాపురస్తుడు దివ్యాంగుడు యాదగిరి రమేష్‌ను ఆవాజ్ సేవాసంస్థ నిత్యావసర సరుకులతో పాటు రూ. 200లు నగదుతో ఆదుకుంది. ప్రభుత్వం ప్రతినెలా పెన్షన్ మంజూరు చేసేంతవరకు రమేష్‌కు సంస్థ తరపున ప్రతినెల రూ. 200లుతో పాటు నిత్యావసర సరుకులు అందజేస్తామని ఆవాజ్ కమిటి అధ్యక్షులు షేక్ ఆబి, కార్యదర్శి షేక్ జమీర్, కోశాధికారి షేక్‌షఫి తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ ఘనీబాషా తదితరులు పాల్గొన్నారు.

## అతి మీడియా

మున్సిపల్ మంత్రి నారాయణ కుమారుడు నిషిత్ దుర్మరణం విషయంలో మీడియా అన్ని విధాలా హద్దులు దాటింది. మంత్రి కుమారుడి విషాదం అందర్నీ కలచివేసేదే! కాని రాష్ట్రంలో సమస్యలను పక్కనపెట్టి ప్రజలను వంచించడమే పనిగా పెట్టుకున్న కొన్ని మీడియా సంస్థలు ఈ వార్తకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చాయి. చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యానికి పుష్కరాల తొక్కిసలాట సంఘటనకు గానీ, మొన్న ఏర్పేడు వద్ద లారీ ప్రమాద సంఘటనకు గాని మీడియా ఇంతటి ప్రాధాన్యతను ఇవ్వలేదు. అదే విధంగా సోషల్ మీడియాలో మంత్రి నారాయణ మీద విషంకక్కారు, అది కూడా పద్ధతి కాదు. మంత్రి నారాయణ పాపాలవల్లే అతని కొడుకు చనిపోయాడన్నట్లు పోస్టింగ్‌లు పెట్టారు. అదీ కరెక్ట్ కాదు. నారాయణ విద్యాసంస్థలను నడుపుకుంటున్నాడు. ఇష్టమైనవాళ్లే డబ్బులు కట్టి బిడ్డలను చదివించుకుంటున్నారు. నారాయణ ఎవరి ఆస్తులను కబ్జా చేయలేదు. బ్యాంకు దోపిడీలు చేయలేదు. మనిషి విషాదంలో ఉన్నప్పుడు ఇలాంటి విషప్రచారాలు చేయడం మంచిది కాదు.


**జి.ఎస్.రావు, నెల్లూరు.**

## ప్రధాని చంద్రబాబు నౌకరా?

భారతదేశపు ప్రధానిని కలవడానికి ఈ దేశంలో ప్రతి పౌరుడూ అర్హుడే! కాకపోతే ప్రతి ఒక్కరికీ అవకాశం రాదంతే! ప్రధాని నరేంద్ర మోడీని ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కలవడంపై తెలుగుదేశం నాయకులు పెద్ద రాద్ధాంతం చేసారు. జగన్మోహన్‌రెడ్డికి ప్రధాని ఎలా అపాయింట్‌మెంట్ ఇస్తాడని, అసలు వాళ్లమధ్య ఏం సంభాషణ జరిగిందోనని చంద్రబాబు ఉలిక్కిపడుతున్నాడు. జగన్మోహన్‌రెడ్డి ఒక పార్టీ అధినేత! 8మంది ఎంపీలు, 70మంది ఎమ్మెల్యేలున్న పార్టీకి అధ్యక్షుడు. ఒక పెద్ద రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు. తానుంటున్న రాష్ట్ర ప్రజలకు సంబంధించిన సమస్యల విషయంలో సంబంధిత రాష్ట్రంలోని ప్రభుత్వం సక్రమంగా పనిచేయనప్పుడు, ఆయన కేంద్రప్రభుత్వాధినేతను కలిసి సమస్యలను విన్నవించడంలో తప్పేముంది.

**– కె.గోపాల్‌రెడ్డి, బోగోలు.**

## గోవిందుడు అందరివాడు!




కలియుగ దేవుడు తిరుమల తిరుపతి శ్రీనివాసుడు అందరివాడు. ఈ దేశంలోని ప్రజలందరి ఆరాధ్యుడు. ప్రతిఒక్క రాష్ట్రం నుండి ఆయన దర్శనార్ధం భక్తులు వస్తుంటారు. తిరుమల హుండీలో అన్ని రాష్ట్రాల భక్తులు వేసే కానుకలుంటాయి. మరి అలాంటి తిరుమలకు ఇ.ఓగా ఉత్తర భారతదేశానికి చెందిన ఐఏఎస్ అధికారి అనిల్‌సింఘాల్‌ను ఇ.ఓగా నియమిస్తే తప్పేంటి? ఆయనపై కోర్టుకు పోతామని విశాఖ శారదా పీఠం స్వరూపానందస్వామి అంటున్నాడు. పిచ్చి ముదిరితే రోకలి చుట్టమన్నది ఇలాంటి వాళ్లకే! యోగులకు యోగ్యత ఉండాలి, జాతీయ భావం వుండాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

సేవకుడిగా జీవిస్తా...

# ఎమ్మెల్యేగానే మరణిస్తా!

----- 'పెద్దల కొలువు' సభలో కోటంరెడ్డి -----



నాకు మంత్రిని కావాలి, కేంద్రమంత్రిని కావాలి అనే కోరికలు లేవు. ఒకవేళ అవి వచ్చినా వాటిని బోనస్‌గానే పరిగణిస్తా! ఇప్పుడు ఎమ్మెల్యేగా వున్నాను, తుదిశ్వాస విడిచే రోజు కూడా ఎమ్మెల్యేగానే ఉండాలనేదే నా కోరిక. "శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మృతి' అన్న వార్తే నా రాజకీయ జీవితానికి చివరి వార్త కావాలన్నది తన బలమైన ఆకాంక్షగా ఉద్వేగభరితంగా చెప్పుకొచ్చాడు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. ఈ నెల 14వ తేదీన నెల్లూరు, పొదలకూరురోడ్డులోని ఈఎస్‌ఐ ఆసుపత్రి ముందు తన సొంత నిధులతో సీనియర్ సిటిజన్స్‌కు 'పెద్దల కొలువు' పేరుతో నిర్మించనున్న విశ్రాంతి మందిరంకు వృద్ధుల చేతే ఆయన శంకుస్థాపన చేయించాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన సీనియర్ సిటిజన్స్ అంతా కూడా ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనితీరును అభినందిస్తూ ఈయన భవిష్యత్‌లో రాష్ట్రమంత్రి, కేంద్రమంత్రి స్థాయికి ఎదగాలని తమ ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో చివరిగా మాట్లాడిన కోటంరెడ్డి పెద్దలు తన పట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞతలు చెబుతూ జీవితాంతం ప్రజల మనిషిగా, ప్రజా ఎమ్మెల్యేగా ఉండిపోవాలనేది తన లక్ష్యమన్నారు. తన తండ్రి లేడని, అయినా ఇంతమంది తనను బిడ్డలాగే చూసుకుంటున్నారని, ఇది తన అదృష్టమని చెప్పుకుంటూ, వారి కోసం మొదటి 'పెద్దల కొలువు' మందిరాన్ని తన సొంత డబ్బుతో కట్టించడం తనకు వచ్చిన అపూర్వ అవకాశంగా చెప్పుకున్నారు. తన తమ్ముడు గిరి మరో రెండు 'పెద్దల కొలువు' భవనాల నిర్మాణానికి ముందుకొచ్చాడని, అలాగే బెంగుళూరుకు చెందిన మిత్రుడు మరో మూడు 'పెద్దల కొలువు' భవనాల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నాడని, సీనియర్ సిటిజన్స్ స్థలాలను గుర్తిస్తే, అధికారులతో మాట్లాడి వెంటనే వాటిని కూడా ప్రారంభించేలా చేస్తానని కోటంరెడ్డి హామీ ఇచ్చారు.


వైకాపా స్థానిక నాయకులు సునీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.రూప్‌కుమార్‌యాదవ్, బొబ్బల శ్రీనివాసయాదవ్, లేబూరు పరమేశ్వరరెడ్డి, వైకాపా నాయకులు సత్తార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# చెమ్మగిల్లిన కళ్లకు చంద్రబాబు ఓదార్పు



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 13వ తేదీన నెల్లూరొచ్చారు. నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలోనే ఆయన హెలికాప్టర్‌లో దిగారు. ఆయనతోపాటు భార్య భువనేశ్వరీదేవి, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కూడా వచ్చారు. నేరుగా నారాయణ ఇంట్లోకి వెళ్లారు. పుత్రుడిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో వున్న మంత్రి నారాయణను ఓదార్చారు. జరిగిన దారుణం మరచిపోలేనిదైనా గుండె నిబ్బరం చేసుకుని, తిరిగి మామూలు మనిషివి కావాలంటూ నారాయణకు ధైర్యం చెప్పారు. చంద్రబాబు దంపతులు దాదాపు గంటకు పైగానే నారాయణ కుటుంబసభ్యులతో వుండి వారి మనసుల్లోని బాధను తగ్గించే ప్రయత్నం చేసారు. ప్రమాదం జరిగిన తీరు గురించి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. నారాయణ సంస్థలలో పని చేస్తున్న వేలమంది ఉద్యోగుల బ్రతుకు, భవిష్యత్ కోసం మీరు ధైర్యం తెచ్చుకోవాలని నారాయణకు చెప్పారు. నారాయణ ఇంటి నుండి బయటకు వచ్చాక మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ జరిగిన సంఘటనపై తన బాధను వ్యక్తం చేశారు.

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ విశాల్‌గున్నీ, మేయర్ అబ్దుల్ అజీజ్‌లు తిరిగి హెలికాప్టర్‌లో విజయవాడకు బయల్దేరిన చంద్రబాబుకు వీడ్కోలు పలికారు.



దుగరాజపట్నం పోయింది...

# ఇక రామాయపట్నం మిగిలింది







దుగరాజపట్నం పోర్టు ఇక లేదనే విషయం తేటతెల్లం కావడం తెలిసిందే! ఈ పోర్టు వల్ల లాభం లేదని కూడా 'నీతి అయోగ్' పేర్కొంది. దీంతో ఇప్పుడు రామాయపట్నం పోర్టు రాజకీయ నాయకుల ప్రచారాస్త్రమైంది. కావలి సమీపంలోని రామాయపట్నం పోర్టు సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలంటూ నెల్లూరు లోక్‌సభసభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖ వ్రాసారు. దుగరాజపట్నంకు పక్కనే కృష్ణపట్నం పోర్టు ఉండడం, అదీగాక ఇస్రో, పులికాట్ సరస్సుల వల్ల దుగరాజపట్నం పోర్టుకు అడ్డంకులొచ్చాయి. ఇక అధికారులు విశాఖ జిల్లాలోని నక్కలపల్లిని కూడా వ్యతిరేకించారు. రాష్ట్రంలో పెద్దపోర్టు నిర్మాణానికి అవకాశం వున్నది ఒక్క రామాయపట్నంలోనే! 5కిలోమీటర్ల దూరంలోనే జాతీయ రహదారి, రైల్వేలైన్ అందుబాటులో వున్నాయి. దొనకొండ వద్ద నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పోర్టుపై సర్వే చేసిన రైట్ సంస్థ రామాయపట్నం పోర్టుకు ఎన్నో అనుకూల అంశాలున్నాయని, పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యాలతో పోర్టు నిర్మాణం చేపట్ట వచ్చుని వెల్లడించిందని మేకపాటి ఆ లేఖలో పేర్కొన్నారు.

గతంలోనే ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డి రామాయపట్నం పోర్టు అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించారు. కావలి మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి ఈ పోర్టు సాధన పేరుతో పాదయాత్ర చేశారు! ఇప్పుడు వారికి మేకపాటి కూడా జత కావడం రామాయపట్నం పోర్టు అంశానికి బలం చేకూర్చేదే!

# దొంగలకు బాస్ చంద్రబాబే!

- కాకాణి




బ్యాంకుల నుండి వందలు, వేలకోట్లు అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన బడాబాబులకు బాస్ చంద్రబాబేనని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించాడు. ఈ నెల 14వ తేదీన నెల్లూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయ్‌మాల్యా లాంటి వాళ్ల వందమంది తెలుగుదేశంలో వున్నారు. రాష్ట్రమంత్రి వర్గంలోనే అవినీతిపరులు, ఆర్థిక నేరగాళ్లున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే వాకాటి నారాయణరెడ్డి 450కోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టాడని ఫిర్యాదు చేసాం. అయినా చంద్రబాబు పట్టించుకోకుండా సీటిచ్చాడు. ప్రస్తుతం సిబిఐ దాడుల నేపథ్యంలో వాకాటి ఉచ్చు తనకెక్కడ తగులుకుంటుందోనన్న భయంతోనే ఆయన వాకాటిని పార్టీ నుండి సస్పెండ్ చేశాడు. మరి వాకాటిని ఒక్కడినే సస్పెండ్ చేస్తే సరిపోతుందా? కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపీలు రాయపాటి సాంబశివరావు, సీఎం రమేష్, రాష్ట్రమంత్రి గంటా శ్రీనివాసరావులు బ్యాంకులను మోసం చేయలేదా? వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని కాకాణి ప్రశ్నించాడు. స్వయానా చంద్రబాబే ఓటు-నోటు కేసులో ముద్దాయిగా వున్నాడని, ముందు తనపై సిబిఐ విచారణ చేయించుకుని ఆయన మచ్చలేని నాయకుడిగా బయట పడాలని కాకాణి సూచించాడు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకులకు ఎగ్గొట్టిన పాపపు డబ్బుతోనే మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాకాటి నారాయణరెడ్డి ఓట్లు కొన్నాడని విమర్శించాడు. కేవలం అక్రమ సంపాదనతోనే ఓట్లు కొనే పరిస్థితి వస్తే పేద, మధ్య తరగతి ప్రజలు ఇక రాజకీయాలకు దూరం కాక తప్పదన్నారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు మెట్టు విష్ణువర్ధన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఎం.వెంకటశేషయ్యలు పాల్గొన్నారు.

# ప్రధానిని జగన్ కలిస్తే తప్పేంటి?

- బీజేపీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి




ప్రతిపక్ష నేత హోదాలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీని కలిస్తే తప్పేముందని, కొన్ని పార్టీల నాయకులు దీనిపై అవాకులు చెవాకులు పేలడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానిని జగన్ కలిసిన విషయంపై ఇదే విధంగా వక్రబుద్ధితో మాట్లాడితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గత మూడేళ్లుగా అవినీతికి తావులేని పరిపాలనను ప్రధాని మోడీ అందించారని, ఆయన నాయకత్వంలోనే వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెల 25న విజయవాడకు వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసే దిశగా అమిత్‌షా పర్యటన ఉండబోతోందని, అమిత్‌షా పర్యటన లోపే జిల్లాలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నాగరాజారావు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, కాయల మధు, యరబోలు రాజేష్, పరుశురాం, గడ్డం అజయ్‌కుమార్, జయచంద్ర, ఎం.శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# ఠారెత్తిస్తున్న సూరీడు

మే నెల... రాళ్ళు, రోళ్ళు పగిలే ఎండలు... దీనికితోడు వడగాల్పులు... పగలు లేదు రాత్రి లేదు... ఎప్పుడైనా ఉక్కపోతే. ఈ వేసవిలో 38డిగ్రీలతో మొదలైన ఉష్ణోగ్రతలు ఇప్పుడు 45డిగ్రీలను తాకాయి. 14వ తేదీ 43డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా 15వ తేదీ ఏకంగా 45డిగ్రీలు నమోదైంది. 16వ తేదీ 44.5డిగ్రీలు నమోదైంది. ఇంత తీవ్రంగా కాస్తున్న ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల దాకా జనం ఇంటి నుండి బయటకొచ్చే పరిస్థితులు లేవు. 5గంటల తర్వాత బయట కొచ్చినా నిప్పుల కుంపటిలో అడుగుపెట్టినట్లుగానే వుంటోంది. ఎండల దెబ్బకు మిట్టమధ్యాహ్నం వేళ నెల్లూరు రోడ్లు కర్ఫ్యూ విధించారన్నట్లుగా నిర్మానుష్యంగా మారుతున్నాయి.

# నారాయణకు స్పీకర్ పరామర్శ



రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు ఈ నెల 13న నెల్లూరులోని మంత్రి నారాయణ నివాసానికి వచ్చారు. కొడుకును కోల్పోయి విషాదంలో వున్న మంత్రి నారాయణ కుటుంబసభ్యులను పరామర్శించారు. నిషిత్ చిత్రపటం వద్ద పూలు చల్లి ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు.

# సుశీలమ్మను సత్కరించిన బొమ్మిరెడ్డి



ఈ నెల 14వ తేదీ మదర్స్‌డే సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి నెల్లూరు, అయ్యప్పగుడి ప్రాంతంలోని ప్రగతి ఛారిటీస్‌కు వెళ్లారు. తన భర్త నెలకొల్పిన ఈ సంస్థను ఎంతో సమర్ధవంతంగా నడుపుతున్న నిర్వాహకురాలు సుశీలమ్మను సన్మానించారు. ఈ సందర్భంగా బొమ్మిరెడ్డి తన సొంత డబ్బు పదివేల రూపాయలతో సంస్థకు బియ్యం, చక్కెర, పప్పుదినుసులు, గోధుమ పిండి వంటి సరుకులు అందజేశారు. జిల్లా పరిషత్ ద్వారా కూడా ఈ సంస్థకు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ వసుమతి, కలువాయి జడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు అల్లారెడ్డి సతీష్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# భారీగా ఎస్ఐల బదిలీ

జిల్లా వ్యాప్తంగా 16మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ విశాల్‌గున్నీ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే స్టేషన్‌లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఎస్ఐల బదిలీకి ప్రాధాన్యతనిచ్చారు. విఆర్‌లో వున్న ఎస్‌కె సుభానిని నెల్లూరు మూడోనగరానికి, ఎన్.మధుసూధన్‌రెడ్డిని గూడూరు వన్‌టౌన్‌కి, డి.వెంకటేశ్వర్లు, ఏ.వెంకటేశ్వర్లు, వి.చినఅంకయ్యలను స్పెషల్ బ్రాంచ్‌కు, ఎస్.కె.కాలేషాను బాలాజీనగర్‌కు, ఎస్.వెంకట్రావ్‌ను సిసిఎస్‌కు, ఎస్.కె. జానీబాషాను నెల్లూరు వన్‌టౌన్‌కు, సి.హెచ్.కృష్ణానందం, కె.నారాయణ, జి.ఉమాదేవిలను డిటిసికి, టి.బి.సుశీల కుమారిని మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. గూడూరు వన్‌టౌన్‌లో వున్న కె.సుధాకర్‌ను, మనుబోలులో వున్న ఎం.గంగాధర్‌ను, నాయుడుపేటలో వున్న కె.మారుతీకృష్ణను విఆర్‌కు పిలిపించారు. ముత్తుకూరులో వున్న జె.వి.శ్రీనివాసులు రెడ్డిని మనుబోలుకు, కావలి టూటౌన్‌లో వున్న ఎస్.కె.జిలానిని వింజమూరుకు బదిలీ చేశారు.

# జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం



ఈనెల 15న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జూనియర్ సివిల్‌జడ్జిగా ఎన్నికైన శ్రీరామ్ శ్రీనివాస్ కళ్యాణ్‌ను జడ్పీ కాలనీలోని వారి స్వగృహానికి స్వయంగా వెళ్లి శాలువా, పూల బొకేలతో సత్కరించారు. తండ్రి ప్రముఖ న్యాయవాది శ్రీరామ్ పెద్దయ్యను, తల్లి వెంకటమ్మలను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ సివిల్‌జడ్జిగా నెల్లూరురూరల్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే శ్రీరామ్ శ్రీనివాస్ కళ్యాణ్ భవిష్యత్‌లో ఒక మంచి జడ్జిగా రాణించి రూరల్ నియోజకవర్గానికి మంచి పేరు తేవాలని, మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 29, 35వ డివిజన్‌ల ఇన్‌ఛార్జ్‌లు చెక్క సాయి సునీల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# చిల్డ్రన్స్ పార్క్‌లో జలకాలాట



ఇంత పెద్ద నెల్లూరులో చిన్నపిల్లల ఆహ్లాదానికి వున్న ఒకే ఒక స్పాట్ చిల్డ్రన్స్ పార్క్! ప్రారంభించిన కొత్తల్లో బాగానే వుండేది. తర్వాత వ్యాపార సంస్థలకు లీజులకిచ్చి పాడుచేసారు. మొదట్లో చిన్నారులకు స్విమ్మింగ్ పూల్ నిర్మించారు. అయితే నిర్వహణ సరిగా లేక పాడుబడిపోయింది. నగర మేయర్ అజీజ్ చొరవతో ఈ స్విమ్మింగ్ పూల్‌ను ఈమధ్యనే బాగుచేశారు. ఈ నెల 13న మేయర్ దీనిని పునః ప్రారంభించారు. వేసవిలో చిన్నపిల్లలు దీనిని చక్కగా వాడుకోవచ్చు. స్విమ్మింగ్ కోచ్‌ను కూడా ఏర్పాటు చేశారు.

# ఎంపిఇడిఏ డైరెక్టర్‌గా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎంపిఇడిఏ) డైరెక్టర్‌గా బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఎంపెడా జాతీయ ఛైర్మెన్, కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ఉత్తర్వులు జారీ చేశారు. ఏబివిపి నుంచి ఎంతో క్రియాశీలకంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో బీజేపీలో వివిధ పదవుల్లో సురేష్‌రెడ్డి పని చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఎంపెడా డైరెక్టర్‌గా నియమించింది.

# వీనుల విందుగా అన్నమాచార్య సంకీర్తనల గానం



పద కవితాపితామహుడు, వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుల 609వ జయంతిని పురస్కరించుకుని వివిధ సంగీత విద్యాలయాలకు చెందిన 108 మంది విద్యార్థులు, కళాకారులు ఈ నెల 13వ తేదీ నెల్లూరు నగర వీధుల్లో సప్తగిరి సంకీర్తనా గానామృతం, శ్రీ అన్నమాచార్య సంకీర్తనా గానలహరి, నగరోత్సవం నిర్వహించారు. ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమై రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయం వరకు సాగింది. గాయనీగాయకులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు వీనులు విందుగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఎ.లక్ష్మీప్రసన్న(శ్రీ గురుకృప సంగీత విద్యాలయం), ఎ.రమాదేవి(భారతీ సంగీత విద్యాలయం), పి.హేమలక్ష్మి (శ్రీ విజయవాణి సంగీత విద్యాలయం), ఆర్.పద్మాచక్రవర్తి(శ్రీరామనాథ సంగీత విద్యాలయం), ఎస్.నాగలక్ష్మి (శ్రీ వీణాధరి సంగీత విద్యాలయం), పి.దేవసేన, టి.నాగలక్ష్మీలత శిష్యబృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పి.హేమలక్ష్మి, ఆర్.పద్మాచక్రవర్తి వీణ సహకారం, ఎం.లోకేష్‌బాబు, కె.టి.షణ్ముఖ వయోలిన్ సహకారం, శాంతి కళాధర్ మృదంగం, శాంతికుమార్ తబలా, సురభి సంగీత్ సౌరభ్ కీబోర్డు సహకారం అందించారు. డా॥ యనమండ్ర నాగదేవిప్రసాద్, ఎంపి ఆంజనేయులు, దువ్వూరు బెనర్జీ, కళాంజలి అనంత్‌లు పర్యవేక్షించారు.

# మైనార్టీ హాస్టల్ మార్చండి



నెల్లూరు, ఆటోనగర్ ప్రాంతంలో వున్న మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ హాస్టల్‌ను మరో చోటకు తరలించాలని తెలుగు విద్యార్థి సంఘం అధ్యక్షులు జి.వి.ప్రసాద్ ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్‌లో కాలుష్య ప్రభావం వల్ల విద్యార్థులు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతున్నారని, కాబట్టి హాస్టల్‌ను సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# శతాధిక కవిసమ్మేళనంలో నెల్లూరు కవులు



విజయవాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఈ నెల 14వ తేదీ ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆవిర్భావసభ, రాష్ట్ర స్థాయి శతాధిక కవిసమ్మేళనం జరిగింది. ఈ కవిసమ్మేళనంలో నెల్లూరు పెన్నారచయితల సంఘం ప్రధానకార్యదర్శి గుండాల నరేంద్రబాబు, డాక్టర్ టి.మాల కొండయ్య(కవి, రచయిత) పాల్గొని కవితాగానం చేసి సభికుల, ముఖ్య అతిథుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపి రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షులు పోట్లూరి హరికృష్ణ, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, చలపాక ప్రకాష్, కలిమిశ్రీల చేతుల మీదుగా నెల్లూరు కవులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో ఘనసత్కారాన్ని అందుకున్నారు.



# త్వరలో నెల్లూరుకు విమాన సేవలు

## కేంద్రమంత్రి అశోక గజపతిరాజు

నెల్లూరుజిల్లాకు త్వరలో విమాన సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర విమానయాన అభివృద్ధి మంత్రి అశోక్‌గజపతిరాజు వెల్లడించారు. సోమవారం నెల్లూరులోని రాష్ట్ర మంత్రి నారాయణ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరులో విమానాశ్రయం ఏర్పాటుకు భూసేకరణలో జాప్యం జరుగుతోందన్నారు. పూర్తిస్థాయి స్థల సేకరణ చేపట్టి, రహదారులు నిర్మించి విమాన సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రపంచ దేశాలతో పోటీగా భారత విమానయాన సేవలు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. అలాగే ఆర్థికంగా మరింత వనరులు చేకూర్చేలా సరుకుల రవాణాపై కూడా దృష్టి పెడుతామన్నారు.

# అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తాం!

## - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని మినీబైపాస్‌లోగల కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఈనెల 13వతేదీ మంత్రి పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా కెవికెలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు, చేపడుతున్న విస్తరణ పథకాల గురించి ఆరా తీసారు. రైతులు ఆధునిక పద్ధతులు అందిపుచ్చుకుని ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. రసాయనాల వినియోగం లేని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంభించాలన్నారు. వ్యవసాయశాఖకు సంబంధించి జిల్లాకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వివరించారు. నిమ్మ, బత్తాయి వంటి పంటలను కాపాడే దిశగా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు రూ. 28కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన వసతులను కల్పించడంలో వ్యవసాయశాఖ తరఫున రాజీ పడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకట స్వామినాయుడు, వ్యవసాయశాఖ జేడి హేమమహేశ్వరరావు, కెవికె సమన్వయకర్త ఓబయ్య, ఆత్మ డిపిడి విజయభారతి, కెవికె శాస్త్రవేత్తలు రత్నకుమారి, అరుణ, ఝాన్సీ లక్ష్మీబాయి, నారాయణస్వామి పాల్గొన్నారు.




## క్రీడల్లో రాణించాలి...

నెల్లూరుజిల్లా విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల నిర్వాహకులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేసిన అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువే ప్రధానం కాదని, ఆటపాటలూ అంతే ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. 58క్రీడా శిక్షణ శిబిరాలకు ప్రభుత్వం రూ. 5లక్షలను వెచ్చిస్తోందన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకట స్వామినాయుడు, మాజీఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పరసారత్నం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణయ్య, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి రామ్మూర్తి, జిల్లా పిఇటి అసోసియేషన్ కార్యదర్శి సనత్‌కుమార్, నారా లోకేష్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఛైర్మెన్ రవిచంద్ర పాల్గొన్నారు.

# బ్రాహ్మణ పరిచయ వేదికకు అనూహ్య స్పందన



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య, తెలుగు బ్రాహ్మణ వివాహ పరిచయవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధిలోని సుమంగళి కళ్యాణ మండపంలో జరిగిన 15వ రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయవేదికకు అనూహ్య స్పందన లభించింది. తొలుత వెల్లంచేటి ప్రసూన తొలివధువు పేరు చదివి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి వధూవరులు దాదాపు 400 రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వారి తల్లిదండ్రుల సహాయంతో తమతమ బయోడేటాలను ఇచ్చిపుచ్చుకుని వేదిక వద్దనే నాలుగైదు సంబంధాలను కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు వెల్లంచేటి చంద్రమౌళి మాట్లాడుతూ ఏపిలో బ్రాహ్మణులు 60లక్షల మంది వరకు ఉన్నారని, దాదాపు 4లక్షల జంటలకు వివాహం కావాల్సి ఉందన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, బంధువర్గం, స్నేహవర్గాల సమాచారంతో వివాహాలు జరుగుతుండేవన్నారు. ఈరోజుల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛినమై ఉద్యోగావకాశాల పేరుతో పలు ప్రాంతాలకు విస్తరించిపోయారని, ప్రస్తుతం విద్యలో యువతీయువకులు పోటీ పడుతున్న తరుణంలో వివాహ సమాచారం అందుబాటులో లేక వివాహాలు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఈ వివాహ పరిచయ వేదికలు మంచి సాంప్రదాయానికి నాందని, సంవత్సరానికి రెండు పరిచయ వేదికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యం. కామేశ్వరప్రసాద్, జి.వి. శివనారాయణ, విస్సా రామచంద్రరావు, యస్. మాధవరావు, ఎంఎస్ సూరి, భాస్కర్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

# భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కుల అందజేత



నెల్లూరు దర్గామిట్టలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. కృష్ణపట్నం పోర్టు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మధుసూదనరావు అనారోగ్యంతో జనవరి 6న మృతి చెందారు. మృతునికి చెందాల్సిన భద్రత ఎక్స్‌గ్రేషియా రూ. 2లక్షల చెక్కులను అతని భార్య లిల్లీ రాచెల్‌కు అందజేశారు. పిల్లలు హారిక, జోహన, జోయాల్ అనుదీప్‌లకు రూ. 2లక్షల చెక్కులను అందజేశారు. మృతుల కుటుంబాలకు పోలీసు శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని ఎస్పీ తెలియజేశారు. అదనపు ఎస్పీ శరత్‌బాబు, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షులు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇది భారతీయ జనం పార్టీ

## - బీజేపీ నేతలు



భారతీయ జనతా పార్టీ ఒక కుటుంబ పార్టీ కాదని, జనం పార్టీ అని, ప్రజలే ఇక్కడ నాయకులని బీజేపీ జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన రిటైర్డ్ పిడబ్ల్యూడి వర్క్ ఇన్స్‌పెక్టర్ తలారి వెంకటయ్య, మరో 50మంది బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా నెల్లూరు, మినీబైపాస్‌లోని పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇతర పార్టీలలో కుటుంబసభ్యులకు తప్ప కార్యకర్తలకు నాయకత్వం రాదని, బీజేపీలో కష్టించి పనిచేసే కార్యకర్తలకే నాయకత్వం దక్కుతుందన్నారు. టీ అమ్ముకునే ఓ సాధారణ వ్యక్తి దేశ ప్రధాని కాగలిగాడంటే అది బీజేపీ వల్లనే సాధ్యమైందన్నారు. బీజేపీలో దళితులకు ప్రాధాన్యత వుందని, బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన బంగారు లక్ష్మణ్ అందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. మోడీ విధానాలను నచ్చి దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు బీజేపీలో చేరుతున్నారన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో అట్టడుగున ఉన్న ప్రజలు నరేంద్రమోడీ ప్రభుత్వం మీద ఎన్నో ఆశలతో ఉన్నారని, అందుకు అనుగుణంగానే అధికారంలోకి వచ్చిన 3సంవత్సరాలలోనే ఎక్కువ పథకాలు పేద ప్రజలను ఉద్దేశించి పెట్టిన పథకాలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో గీత సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ మారుబోయిన శ్రీనివాసులు, నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినాయకరావు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు బండారు శ్రీనివాసులు, పరశురాం, ఎస్సీ మోర్చా నగర అధ్యక్షులు కాయల మధు, నాయకులు సాయి శ్రీనివాసులు, నందకుమార్‌రెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

# క్రీడాకారులకు పౌష్టికాహారం



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసి సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో ఆదివారం క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య పాల్గొన్నారు. దాతలుగా వ్యవహరించిన సయ్యద్ మదార్, భక్తవత్సలరెడ్డిని అభినందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా 2 వైస్‌ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి, ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## గూడూరు డివిజన్ వార్తలు

### శివాలయానికి
# నూతన పాలక మండలి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

గూడూరు పట్టణంలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయం నూతన పాలక మండలి ఛైర్మన్‌గా నాగసూరు వెంకటలక్ష్మి ఇటీవల ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి పాలక మండలి సభ్యులు సమిష్టిగా కృషి చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. గూడూరు ప్రాంతంలో దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు సమీకరించి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శివాలయం ఛైర్మన్ నాగసూరు వెంకటలక్ష్మి మాట్లాడుతూ గూడూరు శివాలయానికి ప్రత్యేకత ఉందని, ఆలయ అభివృద్ధికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నూతన పాలకమండలి సభ్యుల చేత ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. వారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, దేవాలయ కమిటి సభ్యులు రాజేశ్వరమ్మ, చిరంజీవిగౌడ్, రమణయ్య, రత్నం, లీలావతి, సత్యనారాయణ, దేవాలయ ఇ.ఓ శ్రీనివాసరావు, మాజీ శివాలయ ఛైర్మన్ నాగసూరు గోపాలరావు, పలువురు తెలుగుదేశం నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవస్వామికి వసంతోత్సవం

గూడూరు పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉభయదేవేరుల నడుమ చెన్నకేశవస్వామికి వసంతోత్సవాన్ని వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలతో, శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం చక్రస్నానాన్ని, రాత్రి ధ్వజావరోహణం నిర్వహించారు.

### రామ్మోహన్‌రావు దాతృత్వంలో...
# విద్యార్థినికి ఆర్థిక సాయం

చదువుకోవాలనే తపన ఉంటే సరిపోదని, చదవాలనే ఆలోచన, పట్టుదల, కృషి కలిగి ఉంటేనే సమాజంలో గుర్తింపు వస్తుందని వెంకటేశ్వరస్వామి ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్, ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు అన్నారు. పదోతరగతి పరీక్షల్లో 9.2 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించి పైచదువులు చదువుకునే ఆర్థికస్తోమత లేక మోమిడి గ్రామానికి చెందిన షర్మిల అనే



షర్మిలను అభినందిస్తున్న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్‌రావు తదితరులు

విద్యార్థిని ఆడిటర్ రామ్మోహన్‌రావు దాతృత్వంలో ఇంటర్ చదివించడం జరిగింది. దాతల సాయంను వృధా చేయకుండా పరీక్షా ఫలితాలలో 947 మార్కులు సాధించి, దాతలు చేసిన సాయానికి తగిన గుర్తింపు తెచ్చినందుకు డాక్టర్ సి.జనార్దన్ రెడ్డి ఆ విద్యార్థినికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ చదివించేందుకు ఎవరైనా ముందుంటారని, కానీ చదవాలనే పట్టుదల విద్యార్థుల్లో ఉన్నప్పుడే సాయం చేసినవారికి సంతృప్తి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి వెంచురామయ్య, ఆడిటర్ ఎస్.నాగరాజారావు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు పరిష్కరించాలి
### - తహశీల్దార్ వెంకటేశ్వర్లు

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. పలు సమస్యల పై ప్రజలు తహశీల్దార్‌కు వినతిపత్రాలను అందించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ప్రధానంగా భూసమస్యలు అధికంగా ఉన్నందువల్ల వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో భవాని, ఆర్ఐలు శ్రీనివాసులు, అశోక్, వీఆర్వోలు, పలువురు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## 1వ పట్టణ ఎస్.ఐ బదిలీ

గూడూరు ఒకటో పట్టణ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.సుధాకర్ బదిలీపై విఆర్‌కు వెళ్లారు. ఎస్సైకు మోకాలికి దెబ్బ తగలడంతో కొంతకాలంగా సెలవులో ఉన్నారు. విఆర్‌లో వున్న మధుసూధనరెడ్డిని 1వ పట్టణ ఎస్సైగా నియమించారు.

# జైళ్లలో వసతుల మెరుగుకు కృషి
### - డిఐజి జయవర్ధన్



రాష్ట్రంలోని అన్ని జైళ్లలో వసతులు మెరుగు పరిచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జైళ్ల శాఖ డిఐజి జయవర్ధన్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ గూడూరు సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకొకసారి అన్ని జైళ్లను తనిఖీ చేస్తామన్నారు. అందులో భాగంగానే గూడూరు సబ్‌జైలును తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. జైళ్లలో వసతులు, సదుపాయాలు, సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైళ్లలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా పొగ తాగడాన్ని నిషేధించామన్నారు. ఖైదీలకు పెట్టే ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నామన్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ రామారావు, డిప్యూటి సూపరింటెండెంట్ హంసపాల్, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


## 12వ వర్ధంతి




శ్రీమతి కనుపర్తి రమాదేవి

మరువలేని నీ తీపి జ్ఞాపకాలతో
నిత్యం నీ మధురస్మృతులతో

భర్త
కె.వి.రమణయ్య
సీనియర్ పాత్రికేయులు

కుటుంబ ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా యింటి దైవం
ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరి
మంచి కోరుకునే మా ఇంటి దీపం
మా అమ్మను స్మరిస్తూ...

| కుమారులు - కోడళ్లు | కుమార్తెలు - అల్లుళ్లు |
| --- | --- |
| కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన | సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి |
| మృదుల - వెంకటేష్ | మానస, మౌనిక |
| కనుపర్తి దయాశంకర్ - రేణుక | జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహశర్మ |
| నితిన్, రమానందిక | మేఘన, కౌశిక్ |


# లబ్ధిదారులకు దీపం గ్యాస్ కనెక్షన్లు



నెల్లూరురూరల్ మండలం పొట్టేపాళెంలో ఈ నెల 12వ తేదీ ఇండియన్ గ్యాస్ కృష్ణా ఏజెన్సీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు 30 దీపం గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. శ్రీ కోదండ రామస్వామి ఆలయ ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి సమక్షంలో వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు రాయితీపై గ్యాస్ కనెక్షన్లను అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ సిబ్బంది గ్యాస్ పొదుపు, భద్రతా చర్యలను గురించి ప్రజలకు వివరించారు. ఏజెన్సీ మేనేజర్ తిమోతీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ఆంధ్రప్రదేశ్‌లోని 13జిల్లాల్లో వున్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జిఓఎంఎస్‌నెం. 291 తేది. 17-9-2014 ప్రకారం ప్రభుత్వం జూన్ 30 నాటికి భర్తీ చేయాల్సి వున్నా 2001 నుండి ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా అప్పటి ప్రభుత్వం కాలయాపన చేసిందని, నేటి ప్రభుత్వమైనా స్పందించి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి నిరుపేద మధ్య తరగతి నిరుద్యోగులకు సహాయం చేసి ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ద్వారా వినతిపత్రం సమర్పించుకున్నట్లు ఏపి దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షులు అరవ పూర్ణప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీను గల్పిక 2

# బాబుకు షాకిచ్చిన ట్రంప్

**జరిగిన కథ – హైటెక్‌రత్న చంద్రబాబు తన టీమ్‌తో అమెరికా పర్యటనకు వెళ్లాడు. వాషింగ్టన్ ఎయిర్‌పోర్టులో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దంపతులతో పాటు మాజీ అధ్యక్షులు ఒబామా, బిల్‌క్లింటన్ దంపతులు, బిల్‌గేట్స్, సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌లు ఆయనకు స్వాగతం పలికారు. సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్, బిల్‌గేట్స్‌లు చంద్రబాబు దయవల్లే తాము ఈ స్థాయిలో వున్నామని ట్రంప్‌కు చెబుతారు. అసలు తాను అమెరికా అధ్యక్షుడనయ్యిందే చంద్రబాబు వల్లనని చెప్పి వారికే ట్రంప్ షాకిస్తాడు. తర్వాత చంద్రబాబుకు లిబర్టీ ఆఫ్ స్టాచ్యూ, నయాగారా ఫాల్స్, డబ్ల్యుటిసి భవనాలు కూల్చిన ప్రాంతాన్ని చూపించి తమ దేశపు గొప్పతనాన్ని ప్రదర్శించాలని చూసిన ట్రంప్‌కు, చంద్రబాబు ధీటుగా కౌంటర్‌ఎటాక్ ఇస్తాడు. చంద్రబాబు నోటి వెంట ఎలాగైనా అమెరికా గ్రేట్ అనిపించాలని అనుకుంటూ ట్రంప్ అతనిని వైట్‌హౌస్‌కు తీసుకెళతాడు.**

ఆ తర్వాత...

చంద్రబాబుకు ట్రంప్ వైట్‌హౌస్‌ను చూపిస్తూ... ఇదే ప్రపంచాన్నే దడదడలాడించే అధ్యక్షుడి శ్వేతసౌధం. ఎలాగుంది ఈ ఇంద్ర భవనం అని అడిగాడు. అంతా చూసి చంద్రబాబు... ఇది అమెరికా అధ్యక్షుడి భవనమా... నేను ఇంకా అధ్యక్షుడి బాత్‌రూమ్ అనుకున్నాను... ఇంకో రెండేళ్ల తర్వాత మా అమరావతికి రండి... ఇలాంటి భవనాలు వందలకొద్ది మీకు సులభ్‌కాంప్లెక్స్‌లు మాదిరిగా కనపడుతుంటాయి. మా అసెంబ్లీ, సచివాలయ ఉద్యోగులకు మీ వైట్‌హౌస్ టైప్‌లోనే బాత్‌రూమ్‌లు కట్టించాలనుకుంటున్నాను, మీరు దీనిని వైట్‌హౌస్ అంటున్నారు, మొన్నటి దాకా మా రోశయ్య గవర్నర్‌గా వున్న చెన్నైలోని 'రాజభవన్' దీనికంటే బాగుంటుంది. ఇలాంటివి మా దేశంలో రాష్ట్రానికొకటి లెక్కన ఉంటాయని చెప్పాడు. చంద్రబాబు మాటలతో ట్రంప్ ముఖం గాలితీసిన బెలూన్‌లా అయ్యింది. ఇతనితో ఎక్కువసేపు మాట్లాడి పరువు పోగొట్టుకోవడం ఎందుకని బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం రండి అని డైనింగ్ టేబుల్ వద్దకు తీసుకుపోయాడు. ఎయిర్‌పోర్టు నుండి అప్పటి దాకా ట్రంప్ పక్కనే వున్న యువతిని చూసి చంద్రబాబు... మీ అమ్మాయికి పెళ్లీడు వచ్చినట్లుంది, మీరు లేటు చేస్తే మీకు చెప్పకుండానే పెళ్లి చేసుకుని వచ్చేటట్లుంది, మంచి సంబంధం చూసి పెళ్లి చేయకూడదూ అని సలహా ఇచ్చాడు. షిట్... ఆమె నా కూతురు కాదు, నా భార్య మెలానియా అని పరిచయం చేసాడు ట్రంప్. చంద్రబాబు నాలిక్కరుచుకుని మనసులో ఈ వయసులో నీకు ఇంత పడుచు పెళ్లాం అవసరమా అనుకుని... సారీ, పొరపడ్డానండి, ఆమె వయసును బట్టి చూసి మీ కూతురై ఉంటుందనుకున్నాను, అయినా మీరు అదృష్టవంతులు, మా దేశంలో ఇలాంటి అవకాశాలు తక్కువ, మా మామ ఎన్టీఆర్ కూడా మిమ్మల్ని ఫాలో అయ్యాడు కాబట్టే సీఎం కుర్చీ నాకు దక్కిందనుకున్నాడు. అప్పుడే సర్వర్‌లు వచ్చి అందరికీ ప్లేట్లలో టిఫిన్ వడ్డించసాగారు. చంద్రబాబు మాత్రం వాళ్ళు వడ్డించబోతున్న వంటకాలను వద్దని తన సూట్‌కేసు తెరిచాడు. అందులో నుండి టిఫిన్ బాక్సును బయటకు తీసాడు. మూత తీసాడు. అందులో రెండు పుల్కా, కీర, బొప్పాయికాయ ముక్కలు, బాదం, జీడిపప్పులు ఉన్నాయి. ఏంటిది అని ట్రంప్ అడిగాడు. నా బ్రేక్‌ఫాస్ట్... నేనెక్కడికి వెళుతున్నా మా ఆవిడే నాకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ బాక్సులు పెడుతుంది. ఆమె పెడుతున్న ఆహారం తింటుండబట్టే నేను ఇంత చలాకీగా వున్నాను. ఆమె పెడుతున్న తిండి కాకుండా బయట అడ్డమైన గడ్డి తినబట్టే మావాడు లోకేష్‌కు జయంతులు, వర్ధంతులకు తేడా తెలియకుండా పోయిందన్నాడు. అక్కడ బ్రేక్‌ఫాస్ట్ ముగిసింది. కరెక్ట్‌గా అక్కడ వీళ్లు బ్రేక్‌ఫాస్ట్ చేసే సమయంలో...

ఏపిలో ఏబిసిడి ఛానెల్‌లో బ్రేకింగ్ న్యూస్ ఇలా వుంది... అమెరికాలో హల్‌చల్ చేస్తున్న చంద్రబాబు... అమెరికాలో దిగీ దిగగానే పెట్టుబడుల వేట... అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు 'క్యూ' కట్టిన అమెరికా కంపెనీలు... వెల్లువెత్తిన పెట్టుబడులను నియంత్రించేందుకు స్క్రీనింగ్ కమిటీ వేసిన చంద్రబాబు... అమెరికాలో చంద్రబాబు పర్యటన విశేషాలపై మా ప్రతినిధి గోకుల కృష్ణ అడిగిన ప్రశ్నకు ఐటి మంత్రి లోకేష్‌బాబు వివరణ చూడండి... స్క్రీన్ మీద లోకేష్ ప్రత్యక్షమయ్యాడు. నాన్నగారి అమెరికా పర్యటన విజయవంతంగా జరుగుతుంది. అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఆసక్తిగా వున్నాడు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా మన ప్రియతమ ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి చెప్పారు. ఇక నాన్నగారి స్ఫూర్తితోనే బిల్‌గేట్స్ ఎదిగారు. కాబట్టి ఆయన కూడా మైక్రోసాఫ్ట్ కంపెనీని అమరావతిలో పెట్టడానికి సిద్ధంగా వున్నారు అని చెబుతుండగా మధ్యలో గోకులకృష్ణ కల్పించుకుని... అమరావతికి 'ఆపిల్' కంపెనీ కూడా వస్తుందని తెలిసింది, నిజమేనా? అని ప్రశ్నించాడు. ఒక్క ఆపిల్ ఏంటి, పైనాపిల్, బొప్పాయి, దానిమ్మ, సపోట, ద్రాక్ష... అని రకాల ఫ్రూట్స్ కంపెనీలు కూడా అమరావతికి వస్తాయని అమరావతిలో ఉండేవారికి పండ్లరసాలకు ఇబ్బంది లేకుండా చేస్తానని లోకేష్ చెప్పాడు. ఆ సమాధానానికి గోకులకృష్ణ చేత్తో జుట్టును బలంగా పీక్కున్నాడు.

వైట్‌హౌస్‌లో టీవీ ఛానల్స్‌లో దీనిని చూసిన ట్రంప్, మిగతా వాళ్ళు ఆశ్చర్యపోయారు. ట్రంప్ వుండి.... మీరు దిగి ఇంకా బ్రేక్‌ఫాస్ట్ కూడా పూర్తి చేసుకోలేదు, కాని మీ మీడియా ఏంటి, మీ అమెరికా పర్యటన విజయవంతమైనట్లు, మీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలన్నీ పరుగులు తీస్తున్నట్లు చెబుతున్నాయని అడిగాడు. అందుకు చంద్రబాబు... ఇక్కడ జరిగేదానితో మా మీడియాకు అనవసరం, నేనిక్కడ బెడ్‌రూంలో పడుకుని నిద్రపోతున్నా, నిద్రాహారాలు మాని చంద్రబాబు పెట్టుబడుల కోసం తిరుగుతున్నాడంటూ మా వాళ్ళు వార్తలు ఇస్తారు. ఆ విధంగా నేను సెట్ చేసుకున్నా, ఇక్కడ జరిగేది వాళ్లకు వార్త కాదు, వాళ్లకు ఏది తోస్తే అదే వార్త అని చెప్పాడు. తర్వాత అందరూ కలిసి 'డల్లాస్' వెళ్లారు. అక్కడ ప్రవాసాంధ్రుల సదస్సు జరుగుతుంది. అక్కడ మాట్లాడిన ప్రవాసాంధ్రులు చంద్రబాబును వీరుడు, శూరుడు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. తర్వాత చంద్రబాబు మాట్లాడుతూ... మీరంతా ఇక్కడకు వచ్చి కోట్లు సంపాదించారంటే అది నా పుణ్యమే... బాబొస్తే జాబు గ్యారంటీ అన్నాను... ఆ మాట నిలబెట్టుకున్నాను అని చెప్పాడు. వెంటనే ట్రంప్... బాబొస్తే జాబు అన్నారు సరే... కాని, మీ రాష్ట్రంలో ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదు కదా అని అడిగాడు. బాబొస్తే జాబు అన్నాను... అంతేగాని ఆ జాబు ఆంధ్రాలోనే అన్నానా? నేను ఏపిని ఎడారిగా మార్చబట్టే కదా వీళ్లందరూ అమెరికా వచ్చి మంచి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నాడు. ఆ మాటకు ట్రంప్‌కు అరికాల్లో మండింది. మీ రాజకీయ వాగ్దానాలను మాతో తీర్చుకుంటారా... అని మనసులో అనుకుంటూ... 'బాబు వస్తే జాబు' అని మీరన్నారు, 'ట్రంప్ వస్తే ఇండియన్స్ ఉద్యోగాలన్నీ జంప్' అని నేనన్నాను. నీలాగే నేనూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవద్దా అంటూ అప్పుడే హెచ్1బి వీసా బిల్లుపై సంతకం చేసాడు. ఆ దెబ్బకు ప్రవాసాంధ్రులంతా బాబు వస్తే జాబు రావడం కాదు, పోవడం గ్యారంటీ అనుకుంటూ కూలబడ్డారు.

(అయిపోయింది)

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు నెరవేరే అవకాశం కలదు. తొందరపడి హామీలివ్వడం, చెల్లింపులు జరపవద్దు. విద్యార్థులు బాగా కష్టపడి చదువవలెను. పెట్టుబడి, వ్యాపార విస్తరణకు అవకాశాలుంటాయి. ఇంటి ఖర్చులు పెరుగుతాయి. శుభవార్తలు వింటారు. ఖర్చులకు తగిన ఆదాయం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

స్థిరాస్తుల వ్యవహారాలను వాయిదా వేసికొనడం మంచిది. ఉద్యోగులకు సామర్థ్యం కారణంగా గుర్తింపు గౌరవాలుంటాయి. విద్యార్థులకు మంచి విద్యా ప్రగతి కలదు. విలువైన వస్తువులను కొనుగోలు చేస్తారు. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా వుంటాయి. వృత్తి వ్యాపార జీవనము కలవారికి ఆర్థికస్థితి బాగుంటుంది. కొత్త వ్యాపారాలకు అవకాశాలుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కళా క్రీడా ఉపాధి రంగాల వారికి అవకాశాలు బాగుంటాయి. దూరప్రయాణాల అవసరం ఉంటుంది. విమర్శలు, అభియోగాలున్నా పట్టించుకోవద్దు. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగుతుంది. ఆరోగ్యం స్వల్పంగా ఇబ్బంది పెడుతుంది. అనుకోని స్వల్ప ఆదాయము, వస్తు లాభముంటుంది. ఆర్థిక ప్రగతి బాగుండి వృత్తి వ్యాపారాలు పెరుగుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకోని ప్రయాణాలుంటాయి. కళా క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు నెరవేరవచ్చును. ఆరోగ్యం బాగుంటుంది. బంధుముఖ్యులను పెద్దలను కలుసుకుంటారు. ఆర్థిక పరిస్థితి బాగున్నా ఆదాయం సామాన్యంగా ఉంటుంది. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్య ప్రయత్నాలు నిర్ణయం కాగలవు. చర్చలు సమావేశాలకై దూరప్రయాణాలుంటాయి. ఉద్యోగుల శ్రమకు గుర్తింపు, గౌరవాలుంటాయి. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, వ్యాపారవర్గాలకు పెట్టుబడి అవకాశాలుంటాయి. ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కొన్ని అదనపు ఖర్చులుండినను ఇబ్బంది రాదు. ఉద్యోగ వర్గాలకు పనులు అదనంగా ఉంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలకు అవకాశాలు లభించగలవు. బంధుమిత్రుల రాకపోకలుంటాయి. విలువైన వస్తువులు కొనడం, మంచి ఆరోగ్యముంటుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు క్రమంగా బాగుపడతాయి. ఆదాయం పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 19.5.2017 నుండి
తేది. 25.5.2017 వరకు

ఈ వారము మీనంలో శుక్రుడు, మేషంలో బుధుడు, వృషభంలో రవి కుజులు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో వక్రశని, కుంభంలో కేతువు, కుంభమీన మేష వృషభరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

కర్తరి జరుగుచున్నది. గృహారంభ ముహూర్తములుండవు. జ్యేష్ఠ మాసమున శంకుస్థాపనలు పనికిరావు. చేసిన యజమానికి తీవ్ర దోషము.

### ముహూర్తము

తేది 21 ఆదివారము ఉదయం గంట 9.20 నుండి గంట 11.26లోగా కర్కాటకమున వ్యాపార ప్రారంభ వివాహములు.

### వైశాఖ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | అష్టమి | ప॥ గం.12.47వ॥ |
| తేది. 20 | శని | నవమి | ప॥ గం.12.22వ॥ |
| తేది. 21 | ఆది | దశమి | ప॥ గం.11.30వ॥ |
| తేది. 22 | సోమ | ఏకాదశి | ఉ॥ గం.10.02వ॥ |
| తేది. 23 | మంగళ | ద్వాదశి | ఉ॥ గం. 8.23వ॥ |
| తేది. 24 | బుధ | త్రయోదశి | ఉ॥ గం.6.33వ॥ |
| | పిదప | చతుర్దశి | రా॥ గం.4.16వ॥ |
| తేది. 25 | గురు | అమావాస్య | రా॥ గం.1.54వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శుభకార్య ప్రయత్నాలు అనుకూలం. కుటుంబంలో చిన్నవిషయంపై విభేదాలు రావచ్చును. విద్యా ప్రగతికి గట్టి కృషి అవసరం. అవసరాలకు చెల్లింపులకు కొద్ది ఋణం చేయడం గాని, వాయిదా వేసికొనడం గాని జరుగుతుంది. వృత్తి పరంగా మంచి అవకాశాలుండినా వ్యాపారవృద్ధి అవకాశాలు చేవరవచ్చు. ప్రభుత్వ అనుమతులకు ఆలస్యం జరగవచ్చును.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. విలువైన వస్తువులు, పత్రాలను జాగ్రత్త పరచుకోవాలి. అనుకోని ప్రయాణాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. పనులు నిదానంగా జరగడం గాని, ఆటంకాలు రావడం వల్ల గాని నిలిచిపోవడం జరుగుతుంది. ఆర్థికంగా బాగుండి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, రాబడి బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. విలువైన వస్తువులు యంత్ర పరికరాలు కొంటారు. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి వస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. అనుకున్న పనులను పట్టుదలతో చేస్తారు. సభలు సమావేశాలలో మీ పలుకుబడి బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు లభించగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. శ్రమతో అనుకున్న పనులను జరుపుకొంటారు. కొందరి విమర్శలుంటాయి. పట్టించుకొనవద్దు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. బిడ్డల ఉద్యోగ, శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. బంధువర్గంతోను, సహచరులతో జాగ్రత్తగా ఉండండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. అందుచే టెన్షన్‌గా ఉంటుంది. కుటుంబంలో అనుకూలత తక్కువ. ఖర్చులు అదనంగా పెరుగుతాయి. ఆర్థికాభివృద్ధికై ప్రయత్నాలు నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. వృత్తి పరంగా ఆదాయం తృప్తికరం. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారి సామాన్య ఆదాయముంటుంది. ఇతరుల నుండి విమర్శనలు ఎదుర్కొనక తప్పదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఇంటికి కొత్త విలువైన వస్తువులు పరికరాలు కొంటారు. బాకీల చెల్లింపులు సకాలంలో జరుగుతాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, ఉద్యోగార్థులకు అవకాశాలు లభించడం, విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది. ముఖ్య వస్తువులు, పత్రాలు జాగ్రత్త పరచుకొనండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. ఉద్యోగులకు స్థానమార్పు ఉంటుంది.

# కల్యాణ వైభవం...!



నెల్లూరు మాగుంట లే అవుట్ వాస్తవ్యులు కొండ్రెడ్డి వెంకటకృష్ణారెడ్డి - ప్రభావతిల మనుమరాలు, కొండ్రెడ్డి వెంకట శ్రీనివాసులురెడ్డి - శ్రీలతల కుమార్తె స్నేహారెడ్డి - నిరంజన్‌రెడ్డి (గుంటూరు వాస్తవ్యులు మెట్టు యల్లారెడ్డి - శివపార్వతిదేవిల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# లాభాల బాటలో కో-ఆపరేటివ్ బ్యాంక్



నష్టాల్లో వున్న కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌ను తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత లాభాల బాట పట్టించానని బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా పొదలకూరు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో బుధవారం ఏటిఎం కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం డిపాజిట్ల రూపంలో రూ.800కోట్లు ఉన్నాయన్నారు. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతు వికాస పథకంలో 70వేల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. అనంతరం ఖాతాదారులకు ఏటిఎం కార్డులను పంపిణీ చేశారు. ఎన్డీసీసీ బ్యాంక్ వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి, సిఇఓ సరిత, డిజిఎం ఉషారాణి, ఏజిఎం మధుసూదన్‌రావు, బిఎం సాయికేశవ రామ్ తదితరులు పాల్గొన్నారు.

# అందంగా ముస్తాబైన అండర్‌బ్రిడ్జి




నెల్లూరులో అండర్‌బ్రిడ్జిలు, గోడలను వివిధ రకాల పోస్టర్లతో, చెత్తరాతలతో పలువురు గబ్బు పట్టిస్తుండడం చూస్తున్నాం. ఎక్కడ చూసినా అశ్లీల సినిమా వాల్‌పోస్టర్లు, సెప్టిక్ ట్యాంకుల చిరునామాలు దర్శనమిస్తుంటాయి. అయితే ఈ వాతావరణాన్ని మారుస్తూ... నేస్తం ఫౌండేషన్ వారు నెల్లూరు నగరంలో ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తెలిసిందే! రామలింగాపురం అండర్‌బ్రిడ్జిని జాతీయోద్యమ నేతల ముఖచిత్రాలతో అందంగా తీర్చిదిద్దిన నేస్తం ఫౌండేషన్ వారు ఇప్పుడు మాగుంట లే అవుట్ అండర్‌బ్రిడ్జిని కూడా వివిధ కళాకృతులతో అందంగా పెయింటింగ్ చేయించి చూపరులను ఆకట్టుకునేలా చేశారు.

# పట్టన్నకు సన్మానం



వాకర్స్ ఇంటర్నేషనల్ నుంచి సిల్వర్ డోనర్‌గా అవార్డు అందుకున్న విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డికి సోమవారం నెల్లూరు నేతాజీ పైలట్ హైస్కూల్‌లో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య పాల్గొని పట్టాభిరామిరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్‌కు ఆర్థిక సాయం అందించడం ద్వారా ఎందరో పేదలకు అండగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఏరియా-2 ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి, వాకర్స్ జిల్లా గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీడియా ఫోటోగ్రాఫర్స్ చలివేంద్రం



నెల్లూరు కలెక్టర్ కార్యాలయానికి, ప్రెస్‌క్లబ్‌కు సమీపంలో మీడియా ఫోటోగ్రాఫర్స్ గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపి డబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రాఫర్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్(ఎపిపిజెఎ) ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రానికి అభయ చారిటబుల్ ట్రస్ట్ స్పాన్సర్ చేయడం అభినందనీయమన్నారు. ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడం సంతోషించతగ్గ విషయమన్నారు. అభయ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు మధు, జాకీర్, కోదండపాణి, ప్రసాద్, సాహుల్, దేవా, ఎడిటర్స్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి హోనాక్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవాలు



శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరం ప్రథమ పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవాలు ఈ నెల 19వ తేదీ శుక్రవారం నుండి 30వ తేదీ మంగళవారం వరకు నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్ అద్దాల మందిరంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు మధుసాయి స్వామి తెలిపారు. గురువారం మందిర ప్రాంగణంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మందిరం ప్రారంభించి 12సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈ నెల 21వ తేదీ హనుమత్ జయంతి రోజున ప్రథమ పుష్కర మహాకుంభాభిషేకాలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శిరిడిలోని హేమసాయిరామ్ అన్నపూర్ణ ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ సైకిల్‌స్వామి వారి దివ్యహస్తములతో శ్రీ సాయినాథ్ మహరాజ్‌కు నూతన స్వర్ణ కిరీట ధారణ జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథులుగా మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దంపతులు, 14వ డివిజన్ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, 15వ డివిజన్ కార్పొరేటర్ అంచూరు జానకి పాల్గొంటున్నారని తెలియజేసారు. ప్రతిరోజూ హోమాలు, మహాకుంభాభిషేకాలు, శ్రీసాయి సచ్చరిత్ర జ్ఞాన యజ్ఞం, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21వ తేదీ హనుమజ్జయంతి రోజున మందిరంలో విశేష పుష్పాలంకరణ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కోట కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీనివాస కళ్యాణం



శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నెల్లూరు టిటిడి కళ్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. టిటిడి వేదపండితుడు శ్రీమన్నారాయణం దాశరథిస్వామి, వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ విగ్రహాలకు విశేషపూజలు, అభిషేకాలు, తిరుమంజనం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పుష్పయాగం కనుల పండువగా జరిగింది. ఉభయకర్తలుగా వొమ్మిన నాగసతీష్, భానుమతి, శ్రీనివాసులు, మాధురి, వంజివాక ధనుంజయ, చంద్రసేన, కొండా శేఖర్‌రెడ్డి, నీరజ, హృషికేశవరావ్, శ్రీలక్ష్మి, డా॥ భానుప్రకాష్, సూర్యకుమారి, దుర్గాప్రసాద్, విద్యుల్లత, పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ, కెవిన్‌రాజు, వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డిలు వ్యవహరించారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు గుండాల గురవయ్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. హిందూధర్మ ప్రచార మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# హడ్కో భారాన్ని ఏ విధంగా తీరుస్తారు...?



హడ్కో అప్పు భారం రూ.1100కోట్లను మున్సిపల్ శాఖ ఏ విధంగా తీరుస్తుందో ప్రజలకు తెలపాలని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్ కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ విజయవాడ కంటే చిన్నదైన నెల్లూరు కార్పొరేషన్ రూ.1100 కోట్లను మున్సిపల్ శాఖ తాము కడతామనడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశం జరిగి రెండు నెలలు కావస్తున్నా మేయర్ ఇప్పటి వరకు హడ్కో నిధుల గురించి స్పష్టత ఇవ్వలేదని, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. హడ్కో నిధులతో చేపట్టిన పనులు నాసిరకంగా అవకతవకలుగా జరుగుతున్నాయన్నారు. 34వ డివిజన్ నేతాజీ నగర్ 4వ వీధిలో జరుగుతున్న పనులు దీనికి నిదర్శనమన్నారు. కార్పొరేటర్లు లేబూరు పరమేశ్వరరెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్, ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్ పాల్గొన్నారు.

# స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

నెల్లూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జూన్ 3న నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ ఢిల్లీరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదుగురు సభ్యులతో కూడిన స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 24వ తేదీ సాయంత్రం 4గంటలకు నామినేషన్ల జాబితా వెల్లడిస్తామన్నారు. 25న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 4గంటల తరువాత అర్హుల నామినేషన్ల జాబితాను ప్రకటిస్తామన్నారు. 28న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 4గంటల తర్వాత పోటీకి అర్హులైన వారి జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కార్యదర్శిగా అదనపు కమిషనర్ గుర్రం రవి వ్యవహరిస్తారని తెలిపారు.

# సింహపురిలో అరుదైన శస్త్ర చికిత్స



నెల్లూరు సింహపురి హాస్పిటల్‌లో మెదడులోని ఉబ్బిన నరాలకు (ఆరిరియో వీనస్ మాల్ ఫార్మేషన్) అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు హాస్పిటల్ న్యూరోసర్జన్ డా॥ వెంకటేశ్వరప్రసన్న తెలిపారు. మంగళవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన అమూల్యకు తలలోని నరాలు ఉబ్బి ప్రమాదభరితంగా మారగా, చికిత్స కోసం సింహపురి హాస్పిటల్‌కు రాగా మెదడులోని నరాలు ఉబ్బినట్లు గుర్తించి అతిక్లిష్టమైన ఆపరేషన్‌ను ఆధునిక పరికరాల సహాయంతో 12గంటల పాటు వైద్యులు కృషి చేసి విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్య సేవలో ఆపరేషన్ ఉచితంగా చేశామన్నారు. న్యూరోసర్జన్స్ డా॥ సతీష్, డా॥ అనిల్‌సింగ్, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ దీక్షాంతి నారాయణ పాల్గొన్నారు.

# జూన్ 3 నుంచి గొలగమూడిలో 'శుభప్రదం'

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, తిరుపతి ఆధ్వర్యంలో జూన్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 'శుభప్రదం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లెల శ్రీహరి తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా చేపడుతున్న 'శుభప్రదం' కార్యక్రమంలో పాల్గొనేందుకు 8, 9 తరగతి విద్యార్థులు అర్హులని తెలిపారు. శుభప్రదం కార్యక్రమాన్ని జిల్లాలోని గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో జూన్ 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు నెల్లూరు టిటిడి కళ్యాణ మండపం నుంచి పొందాలన్నారు. వివరాలకు 8341956102లో సంప్రదించాలని కోరారు.

# పాపం పండెన్!

(మొదటి పేజీ తరువాయి)

పంగనామాలు పెట్టి సిబిఐ కేసుల్లో ఇరుక్కున్న నాయకుడు లేడు. జిల్లా రాజకీయ చరిత్రలో సిబిఐ స్థాయి ఆర్థిక నేరస్థుడిగా నిలిచిన ఖ్యాతి వాకాటిదే అయ్యింది. వాకాటికి పలు కంపెనీలున్నాయి. ఈ కంపెనీల పేరుతో ఆయా బ్యాంకుల్లో ఋణాలు వందలకోట్లలోనే వున్నాయి. ఓ పక్క పారిశ్రామికవేత్తగా, కాంట్రాక్టర్‌గా వుంటూనే ఇంకోపక్క మూడేళ్ళ క్రితం వరకు కూడా కాంగ్రెస్‌పార్టీలో కొనసాగాడు. జిల్లాలో నేదురుమల్లికి ముఖ్య అనుచరుడిగా నడుచుకున్నాడు. వాకాటికి బిజినెస్ తక్కువ బిల్డప్ ఎక్కువ అనే పేరుంది. బ్యాంకుల నుండి తీసుకున్న వందలకోట్ల ఋణాలను వ్యాపార అవసరాలకంటే కూడా బిల్డప్ పనులకే ఎక్కువగా ఖర్చు పెట్టేవాడు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికే ఢిల్లీలో రోజూ ఏం పని వుండదు. కాని వాకాటి మాత్రం ప్రతిరోజూ ఢిల్లీలో వుండేవాడు. అక్కడ ఏం చేసేవాడో, ఎవరిని కలిసేవాడో ఎవరికీ తెలియదు గాని, ఆయన మాత్రం పొద్దస్తమానం అహ్మద్‌పటేల్, గులాంనబీ ఆజాద్, చిదంబరంలతోనే తిరుగుతున్నట్లు చెప్పుకునేవాడు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మరణించడం, రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ కూడా మరణించడం, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుండి నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాకపోవడం... ఇత్యాది కారణాలతో వాకాటి ఆ తర్వాత కాలంలో తెలుగుదేశంలో చేరాడు. మొన్ననే తెలుగుదేశం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టిక్కెట్‌ను తెచ్చుకుని గెలిచాడు. నారా లోకేష్‌ను గట్టిగా పట్టడంతో వాకాటికి ఎమ్మెల్సీ సీటొచ్చింది. ఈయనకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చేనాటికే ఆయన బ్యాంకులకు వందలకోట్లు బకాయిలున్నాడని, బ్యాంకులు ఆయనకు నోటీసులు జారీ చేసాయనే విషయం కూడా చంద్రబాబుకు తెలుసు. వాకాటి బ్యాంకు బకాయిలపై మీడియాలో కూడా పెద్దఎత్తున కథనాలు వచ్చాయి. అయినా ఆరోజు లెక్కలు ఆరోజుకే అన్నట్లు చంద్రబాబు వాకాటికే ఎమ్మెల్సీ సీటిచ్చాడు. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వాకాటి బ్యాంకుల నుండి 40కోట్ల రూపాయలు డ్రా చేసి ఖర్చుపెట్టడం అతని మెడకే ఉచ్చులా తగులుకుంది. ఓ పక్క బ్యాంకుల బకాయిలు చెల్లించకుండా బ్యాంకుల నుండి 40కోట్లు ఎలా డ్రా చేస్తారంటూ భారత పారిశ్రామిక ఆర్థిక సంస్థ చేసిన ఫిర్యాదు మేరకు సిబిఐ ఆయన మీద కేసు నమోదు చేసింది. ఈమేరకే నెల్లూరులో ఆయన నివాసంలో సిబిఐ సోదాలు నిర్వహించి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా వాకాటి బ్యాంకుల నుండి ఋణం తీసుకునే సమయంలో గ్యారంటీగా పెట్టిన ఆస్తుల విలువను పెంచి చూపించాడని, ఉద్దేశ్య పూర్వకంగానే బ్యాంకులను మోసం చేసాడని భారత పారిశ్రామిక ఆర్థిక సంస్థ తన ఫిర్యాదులో పేర్కొంది. ఇది నిజమే. వాకాటి బ్యాంకులకు తనఖాగా తన భూములను ఎక్కువగా పెట్టాడు. వాస్తవంగా వున్న వాటి విలువకంటే అధిక రేట్లకు రిజిష్టర్ చేయించి వాటిని బ్యాంకులకు తాకట్టుగా పెట్టాడని సమాచారం. ఈరోజు అసలు, వడ్డీలు అన్నీ కలిపితే అన్ని బ్యాంకులకు కలిపి ఆయన బాకీపడ్డ మొత్తం వెయ్యికోట్లకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. వాకాటి బ్యాంకులకు తాకట్టు పెట్టిన ఆస్తుల విలువ అందులో పదోవంతు కూడా వుండదు. బ్యాంకు బకాయిలను తీర్చడం వాకాటికి ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు. కేవలం బ్యాంకు అప్పుల నుండి బయటపడడానికే ఆయన చంద్రబాబుకు మొకరిల్లాడు.

అయితే చంద్రబాబు, వై.యస్.రాజశేఖరరెడ్డి లాంటి వాడు కాదు. తప్పుడు మనిషి అని తెలిస్తే వై.యస్. దగ్గరకు రానీయడు. తెలియక తప్పు చేసాడని తెలిస్తే కాపాడడానికి వెనుకాడడు. బ్యాంకులకు వాకాటి వందల కోట్లు బకాయిలు వున్నాడని తెలిసినా చంద్రబాబు పార్టీలో చేర్చుకున్నాడు. ఎమ్మెల్సీ సీటు కూడా ఇచ్చాడు. అతని మీద సిబిఐ కేసు నమోదు చేసిందనగానే ఎటువంటి ముందస్తు నోటీసుగాని, విచారణ గాని లేకుండా వాకాటిని పార్టీ నుండి సస్పెండ్ చేశాడు. వాకాటి బురద తనకెక్కడ అంటుకుంటుందోననే భయంతోనే ఆయన ఈ పని చేశాడు.

## మరి వీళ్ళ సంగతేంటి?

వాకాటి మీద సిబిఐ కేసు నమోదు చేసిందని చంద్రబాబు ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేశాడు. బాగానే వుంది. మరి మారిషస్ బ్యాంకులకు వేల కోట్ల టోపీ పెట్టి అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయి వున్న కేంద్రమంత్రి సుజనాచౌదరి పరిస్థితి ఏంటి? ఆయన మీద ఏ చర్యా లేకపోగా అదనంగా కేంద్రమంత్రి పదవిలో కూడా వున్నాడు. తెలుగుదేశం జమానాలోనే రాయపాటి సాంబశివరావు, నామా నాగేశ్వరరావు, సీఎం రమేష్, గంటా శ్రీనివాసరావులు బ్యాంకులకు వేలకోట్లు అప్పులున్నారు. మరి వీళ్ళను సస్పెండ్ చేసే దమ్ము చంద్రబాబుకు ఉందా? పార్టీలో వాకాటి కొక న్యాయం? మిగిలిన బ్యాంకు ఎగవేతదార్లకు ఒక న్యాయమా? అనే ప్రశ్న కూడా పార్టీ కార్యకర్తల్లోనే వ్యక్తమవుతోంది. మొత్తానికి వాకాటి ఎపిసోడ్ కీలక దశకు చేరుకుంది. ఒక నాయకుడు సిబిఐ చేతిలో పడ్డాడంటే అది అతని ప్రాభవానికి ఆరంభమైనా కావాలి, లేదా అంతమైనా కావాలి. ఎప్పుడూ ఢిల్లీ స్థాయిలోనే మాట్లాడే వాకాటిని అదే స్థాయికి తగ్గ కేసు పట్టుకుంది. ఆయన ఆర్థిక నేరాలను సిబిఐ, ఇంటలిజెన్స్ వంటి సంస్థల చేత విచారణ చేయిస్తే ఆయనకు అది చిన్నతనం కూడా! వాకాటి బిల్డప్‌కు తగ్గట్లుగానే ఆయన ఆర్థిక నేరంపై సిబిఐ కేసు విచారణ చేపట్టడం వాకాటి స్థాయిని పెంచేదే!

# వణుకుతున్న చంద్రన్న!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలంటూ నినదించిన ధైర్యశాలి. గత చరిత్రను చూస్తే జాతీయ రాజకీయాలలో చంద్రబాబు ట్రాక్ రికార్డు బాగానే వుంది. అంత పలుకుబడి కలిగిన నాయకుడు జగన్ ప్రధానిని కలిసాడని తెలియగానే చలి జ్వరం వచ్చినట్లు వణికిపోయాడు. రాజకీయాలలో ప్రధానిగా వున్నవారిని ఏ పార్టీ నేత అయినా కలవవచ్చనే పద్ధతిని మరచి, జగన్‌కు ప్రధాని అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారని మాట్లాడారు. జగన్‌కు అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసిన పిఎంఓ కార్యాలయాన్నీ చంద్రబాబు ప్రశ్నించినట్లయ్యింది.

అయినా జగన్‌కు మోడీ అపాయింట్‌మెంట్ ఇస్తే చంద్రబాబు ఇంతగా ఆక్రోశం చెందాల్సిన అవసరం ఏముంది? తను ఏదో అభద్రతాభావంతో ఉండబట్టే ఇలా నోరు పారేసుకుంటున్నాడు. ఏపిలో జరిగిన, జరుగుతున్న అక్రమాలను మోడీకి జగన్ చెవిలో వూదాడనే కోపంతోనే ఆయన ఈ అరుపులు అరుస్తున్నాడు.

వాస్తవంలోకి వస్తే చంద్రబాబు అంటే మోడీకి ఏమంత నమ్మకం, గౌరవం లేదు. అవసరాన్ని బట్టి చంద్రబాబు రాజకీయ రంగులు మారుతాయని తెలుసుకోలేనంత అమాయకుడు కాదు మోడీ! ఈరోజు తమతో అవసరం వుండి కాబట్టి అణిగి మణిగి వుంటున్నాడు. రేపు బిజెపికి రెండు చోట్ల పరాభవాలు ఎదురై, మోడీ క్రేజ్ తగ్గిందంటే ఇదే చంద్రబాబు దేశంలోని బిజెపి వ్యతిరేక పార్టీలన్నింటిని కలిపి తృతీయ ఫ్రంట్ అనే టెంట్‌ను వేస్తాడు. రాజకీయ స్నేహానికి చంద్రబాబు నమ్మకస్తుడు కాదు. కాని ఇచ్చిన మాట కోసం సోనియాగాంధీనే ఎదిరించి, 16నెలలు జైలులో గడిపిన జగన్‌ను రాజకీయంగా నమ్మొచ్చు. అదీగాక జగన్‌కు రాష్ట్రం తప్పితే జాతీయ రాజకీయాల మీద ఆశ, ఆసక్తి ఉండదు. కాబట్టే బిజెపిలో జగన్ పట్ల సానుకూల ధోరణి కనిపిస్తోంది.

బిజెపికి జగన్ జత కలిస్తే రాష్ట్రంలో తనకు చుక్కలు చూపిస్తారనే భయం చంద్రబాబుకు పట్టుకుంది. ముఖ్యంగా 'ఓటు-నోటు' కేసు బాబు మెడ మీద కత్తిలా వేలాడుతోంది. ఈ కేసును ముందుకు సాగనీయకుండా ఇప్పటివరకు కేంద్రమే ఆదుకుంటోంది. ఈ కేసులో చంద్రబాబు వాయిస్ రికార్డర్ కూడా పక్కా సాక్ష్యంగా వుంది. ఇక అమరావతి రాజధాని భూముల సేకరణ దగ్గర్నుండి, పుష్కరాలకు వేలకోట్లు తగలేయడం, పోలవరం పూర్తయితే పనికిరాని పట్టిసీమ, పురుషోత్తమ పట్నం వంటి ప్రాజెక్టులు కేవలం డబ్బు కోసం చేపట్టినవేననే విషయం తెలియంది కాదు. ఏ రాష్ట్రంలోనైనా మోడీ తాను కాలు పెట్టాలనుకుంటున్నప్పుడు అక్కడ ముందుగా సిబిఐ దాడులు జరగడం చూస్తున్నాం. ప్రస్తుతం మోడీ ఏపిని టార్గెట్ చేసాడు. ఇక్కడ బిజెపికి జగన్ లక్ష్యం కాదు. చంద్రబాబును నిర్వీర్యం చేయడమే అసలు ఉద్దేశ్యం. ఈ మూడేళ్లలో చంద్రబాబుకు కేంద్రం వట్టి మాటలు చెప్పడం తప్ప ఎలాంటి సాయం చేయలేదు. విభజన బిల్లులో చెప్పిన ప్రత్యేకహోదా విషయంలో కూడా ఆయన రాజీపడడం ప్రజల్లో చంద్రబాబు నాయకత్వ స్థాయిని దిగజార్చింది. కేంద్రం ద్వారా చంద్రబాబు రాష్ట్రానికి ఏ పనులూ సాధించలేక పోయాడు, సరికదా అసలే అప్పుల్లో వున్న రాష్ట్రంలో ఈయన చేసిన ఆర్భాటపు పనులన్నీ కూడా ప్రజలకు పని కొచ్చేవి కావు. రాష్ట్ర ప్రభుత్వంలో జరిగే అవినీతి, అక్రమాలపై సిబిఐ విచారణ చేయిస్తే ఎన్నో లొసుగులు బయటపడతాయి. చంద్రబాబు సర్కార్‌ను ప్రజా బోనులో దోషిగా నిలబెట్టడం ఇప్పుడున్న పరిస్థితుల్లో మోడీకి ఏమంత కష్టం కూడా కాదు.

ఏపిలో తెలుగుదేశాన్ని నిర్వీర్యం చేయాలన్నా, చంద్రబాబును బలహీన పరచాలన్నా మోడీకి చిటికెలో పని. తన విషయంలో మోడీ ఆ పని చేయకపోవచ్చని చంద్రబాబుకు ఇంతకాలం బలమైన నమ్మకం ఉండేది. కాని మోడీని జగన్ కలిసొచ్చాక, మోడీ చేతికి అతను చంద్రబాబు గారి అక్రమాల చిట్టా పద్దులు ఇచ్చి వచ్చాక ఆ నమ్మకం కూడా పోయింది. మోడీ ఎక్కడ ఎప్పుడు తనకు ఎసరు పెడతాడోననే ఆందోళన బాబులో కనిపిస్తోంది.

# 'దేశం'పై అరిచారు

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు మూడేళ్ళుగా ఈ రాష్ట్రంలో బిజెపి నాయకులందరు కూడా తమ నోర్లు కట్టేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు తమకు నచ్చకున్నా, చంద్రబాబు పరిపాలన ఘోరంగా వుండి ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నా ఇంతకాలం బిజెపి నాయకులు ప్రజల పక్షాన నిలబడి పోరాడలేకపోయారు. మిత్రపక్షం అనే ముసుగు వారి కాళ్ళకు బంధాలు బిగిస్తూ వచ్చింది. అదీగాక బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కంభంపాటి హరిబాబు గాని, బిజెపి నుండి మంత్రి పదవులు పొందిన కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాలరావులు గాని తెలుగుదేశమే మా పార్టీ, చంద్రబాబే మా నాయకుడు అన్నంతగా లీనమైపోవడంతో మిగతా బిజెపి నాయకులకు వాయిస్ లేకుండా పోయింది.

అయితే ఇంతకాలం తెలుగుదేశం మీద నిలువునా రగిలిపోతూ బయటకు చెప్పుకోలేక బాధపడుతున్న బిజెపి నాయకులకు వైకాపా అధినేత వై.యస్.జగన్ ద్వారా ఓ మంచి అవకాశం వచ్చింది. వై.యస్.జగన్‌కు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వడంపై తెలుగుదేశం నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలకు దిగడం తెలిసిందే!

తొలిసారిగా తెలుగుదేశంపై తిరగబడే అవకాశం బిజెపి నాయకులకు ఈ రూపంలో వచ్చింది. ఇప్పటివరకు వున్న మిత్రపక్షం ఆంక్షలను పక్కనపెట్టేసి బిజెపి నాయకులందరూ కూడా తెలుగుదేశంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మా మోడీనే విమర్శిస్తారా? జగన్‌తో మాట్లాడకూడదని రాజ్యాంగంలో రాసుందా? ఒక ప్రతిపక్ష నేత ప్రధానిని కలిస్తే తప్పేంటంటూ పచ్చనేతలపై ముప్పేట దాడి చేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజెఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజులతో పాటు అన్ని జిల్లాల్లోనూ బిజెపి నేతలు టిడిపిపై విమర్శలతో విరుచుకుపడ్డారు. మన ప్రధానిని వాళ్ళు అన్నేసి మాటలంటుంటే మీరు నోరు మూసుకుని వుంటారా అని గదమాయించేసరికి బిజెపి మంత్రులు కామినేని శ్రీనివాస్, మాణిక్యాలరావులు కూడా నోర్లు తెరచి దేశం నాయకుల తీరును తప్పుపట్టారు.

రాష్ట్రంలో విస్తరించాలని, పార్టీని ఇంకా శక్తివంతం చేయాలన్న స్థానిక నాయకుల ఆకాంక్షకు తెలుగుదేశంతో పొత్తే ప్రతిబంధకమవుతుంది. ఆ పార్టీతో పొత్తు లేకపోయి వుంటే ఈ పాటికి రాష్ట్రంలో బిజెపి ఒక బలమైన పక్షంగానే ఎదిగి ఉండేది. కనీసం ఇప్పటి నుండైనా తెలుగుదేశాన్ని వదిలించుకుని రాష్ట్రంలో సొంతంగా ఎదుగుదామన్న బిజెపి నేతల ఆశలకు జరిగిన సంఘటనలను అంకురార్పణగా చెప్పుకోవచ్చు.

# నెల్లూరు రైల్వేస్టేషన్లకు కొత్త సొగసులు



నెల్లూరుజిల్లాలోని నెల్లూరు, కావలి, సౌత్‌స్టేషన్, వేదాయపాలెం రైల్వేస్టేషన్లలో త్వరితగతిన సౌకర్యాలు కల్పించాలని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు ప్రధాన, సౌత్, వేదాయ పాలెం రైల్వేస్టేషన్లను డిఆర్‌ఎం ధనుం జయతో కలసి బుధవారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ తిరుపతి–షిరిడికి వారంలో మూడురోజులైనా రెగ్యులర్ ట్రైన్ వేస్తే ప్రయాణీకులకు ఎంతో సౌకర్యంగా ఉం టుందన్నారు. ఉలవపాడులో కృష్ణా లేదా హౌరా ఎక్స్‌ప్రెస్, కావలిలో శబరి ఎక్స్ ప్రెస్, నెల్లూరు ప్రధాన స్టేషన్లో కోర మాండల్, తమిళనాడు, గరీభ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపే విధంగా చర్యలు తీసుకోవా లని డిఆర్‌ఎంకు తెలిపారు.

డిఆర్‌ఎం ధనుంజయరావు మాట్లా డుతూ సౌత్, వేదాయపాలెం స్టేషన్లలో రెండు వైపులా ముఖద్వారాలు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలిస్తామన్నారు. విజయవాడ, చెన్నై మూడవ లైను రూ.206కోట్లతో ఐదు దశల్లో పూర్తి చేస్తా మన్నారు. రైల్వే స్థలంలో ఎన్ని సంవత్సరాలున్నా ఆ స్థలా లను రైల్వే స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. బిట్రగుంట రైల్వేయార్డ్‌ను అవసరాలకు అనుగుణంగా త్వరలోనే విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలి పారు. సీనియర్ కమర్షియల్ మేనేజర్ సిఫాలీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.






# బీదకే జిల్లా పగ్గాలు?



తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి కూడా బీద రవిచంద్రనే ఎన్ని కయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నుండి ప్రకటన రావడమే మిగిలివుంది. పార్టీ అధ్యక్షుడిగా బీద రవిచంద్రను పక్కన పెట్టాల్సిన పరిస్థితి గాని, కొత్తవాళ్లకు అధ్యక్ష స్థానం అప్పగించాల్సిన అవసరం గాని లేకపోవడంతో మరోసారి బీదకు జిల్లా దేశం బాధ్యతలు తప్పకపోవచ్చు. ఒకవేళ బీద రవిచంద్ర నాకు వద్దని మొండికేస్తే మాత్రం కొత్తవారికి ఛాన్సుంటుంది. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి అధ్యక్ష పదవిని ఆయన ఎందుకు వదులుకుంటాడు.

జిల్లాలో చంద్రబాబు కులసమీకరణలను బాగానే పాటించాడు. ఓట్ల పరంగా మెజార్టీ సంఖ్యాకులైన కాపుల నుండి మంత్రిగా నారాయణ వున్నాడు. అయితే ఇది రాజకీయంగా రెడ్ల ప్రాబల్యం వున్న జిల్లా! మొదట మంత్రివర్గంలో ఈ జిల్లా నుండి రెడ్లకు స్థానం దక్కలేదు. దీంతో పార్టీలో రెడ్లను అణగదొక్కుతున్నారనే ఒక ప్రచారం హల్‌చల్ చేసింది. అయితే చంద్రబాబు రాజకీయ మేధావి. ఏ టైంలో ఏం చేయాలో ఆయనకు తెలుసు. కరెక్ట్ సమయంలో జిల్లా నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా రెడ్లకు ప్రాధాన్యతనివ్వడం లేదన్న ప్రచారానికి తెరదించారు. సోమిరెడ్డికి మంత్రి పదవిచ్చి పార్టీలోని రెడ్లలో వున్న అసంతృప్తిని తొలగించారు. అదే సమయంలో పార్టీలో బీసీలూ కీలకమే! ఈ వర్గానికి చెందిన బీద రవిచంద్రకు మంత్రిపదవి కాలింగ్ బెల్ కొట్టి, ఆయన లేచి వచ్చే లోపే సోమిరెడ్డి ఇంట్లో దూరినట్లయ్యింది. మంత్రి పదవి ఆశ ఆయనకు బాగానే అంటించి తీరా నీరు గార్చారు. ఇక మంత్రి స్థాయి పదవి జిల్లాలో ఇంకేముంటుంది. జిల్లా పార్టీ పెత్తనం ఇవ్వడమే బీసీలను గౌరవించడమవుతుంది. కాబట్టి అధ్యక్ష పోస్ట్‌లో రవిచంద్రనే కొనసాగిస్తారనడంలో సందేహం లేదు.






# గెలిపించిన ప్రజల కోసం దేనికైనా సిద్ధం



తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల కోసం ఎటువంటి పోరాటాలకైనా సిద్ధమే నని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన నెల్లూరు వెంకటేశ్వరపురంలో పలువురు యువకులు, మహిళలు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నగర మైనార్టీ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్ సేవాదళ్ కార్యదర్శి ఎస్.కె.జమీర్‌అహ్మద్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యే చేసిన ప్రజల కోసం ఎవరితోనైనా పోరాటానికి సిద్ధమేనని, అలాగే తనకు రాజకీయ జన్మనిచ్చిన వై.యస్. కుటుం బానికి ఎప్పుడూ అండగా వుంటానని అన్నారు. నెల్లూరు నగరంలో రైల్వేస్థలాలు, కాలువగట్లపై నివసించేవారికి పునరా వాసం కల్పించాకే, వారిని ఖాళీ చేయించా లని, లేకపోతే వారి తరపున పోరాటానికి తాను ముందుంటానని అన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com